# వరంగల్ వార్త

వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జయశంకర్, జనగామ, ములుగు

సోమవారం 9, సెప్టెంబర్ 2024 | 16 పేజీలు




## నష్టం అంచనా నివేదికలు అధికారులు సత్వరమే అందించాలి



16లో.. జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా

# ఆకునూరి సార్ రాక విద్యాశాఖలో కాక



2 లో..

- విద్యాకమిషన్ ఛైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి ఎంపిక...
- జిల్లాలోని మారుమూల ప్రాంతాలతో అవినాభావ సంబంధం..
- విద్యాశాఖపై కమ్ముకున్న నిర్లక్ష్యపు నీలి నీడలు వీడుతాయా...?
- విద్యాశాఖపై రాజకీయం పెత్తనం సమిసినట్లేనా..?
- విద్యాశాఖలో అక్రమ డిప్యూటేష్ల పర్వం నిగ్గు తేల్చేనా..?
- విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నవారికి అకునూరి కలం పోటు తప్పదా..?
- పాఠశాలలపై కొరవడిన జిల్లా విద్యాశాఖ అధికారి పర్యవేక్షణపై విద్యాకమిషన్ ఛైర్మన్ విచారణ చేపట్టేనా..?
- ములుగు జిల్లా నుండే విద్యా వ్యవస్థ ప్రక్షాళనకు బీజం వేయాలంటున్న ప్రజలు...


ములుగు జిల్లా, ప్రభాతవార్త : ప్రాథమిక విద్య, ఉన్నత విద్య నుంచి సాంకేతిక విద్య యూనివర్సిటీ స్థాయి విద్య వరకు నూతన విద్యావిధానాన్ని రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 'తెలంగాణ విద్యా కమిషన్'ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఉన్నత విద్యలో నాణ్యతా ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. తాజాగా ఈ కమిషన్ నిర్వహణ బాధ్యతలు మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళికి అప్పగించింది. ఆయనను తెలంగాణ విద్యాకమిషన్ ఛైర్మన్‌గా నియమించింది. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. భూపాలపల్లి జిల్లా కలెక్టరుగా ఆకునూరి మురళి 11.10.2016 నుండి 20.01.2018 వరకు విధులు నిర్వహించారు. కలెక్టర్‌గా విధులు నిర్వహించిన కాలంలో పూర్తి ఏజెన్సీ ప్రాంతమైన ప్రస్తుత భూపాలపల్లి జిల్లా, ములుగు జిల్లాలు కూడా అప్పుడు భూపాలపల్లి జిల్లా పరిధిలోనే ఉండేవి.

16లో..



## రోడ్డు మరమత్తు పనులు చేపట్టాలి

చిన్నగూడూరు,ప్రభాతవార్త: మండలకేంద్రంలోని ఆకేరువాగుపై నిర్మించబడిన బ్రిడ్జి ముందు ఉన్న రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకపోయింది. రోడ్డు కొట్టుకపోవడంతో ఆ ప్రాంతంలో 10ఫీట్ల మేర గుంతలు ఏర్పడ్డాయి. దీంతో మండల కేంద్రం నుండి చుట్టుప్రక్కల గ్రామాలకు వెళ్లాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చుట్టప్రక్కల గ్రామాల విద్యార్థులు మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రావాలంటే అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.



## అడ్డగోలుగా క్వార్టర్స్ కేటాయింపు

భూపాలపల్లి, ప్రభాతవార్త : సింగరేణి క్వార్టర్స్ అంటే ప్రతి ఒక్కరికి పండుగే.....సింగరేణి ఏరియాలో పనిచేస్తున్న కంపనీ ఉద్యోగులతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు సైతం తమ పలుకుబడిని ఉపయోగించి అలాట్‌మెంట్ చేసుకున్నట్లు ఇటీవల చేపట్టిన సర్వేతో బయటపడింది. సింగరేణి కార్మికులు నివసించే క్వార్టర్స్‌ను ఇతరులకు రెంట్‌కు ఇవ్వటంతో పాటు ఒక్కో కార్మికుడు, ఇతరులు తమ పలుకుబడిని ఉపయోగించి మరో క్వార్టర్‌ను తీసుకొని కిరాయిలకు ఇవ్వటం ఇటీవల వెలుగు చూసింది.

16 లో..

- సింగరేణి క్వార్టర్స్ కేటాయింపులో ఇష్టారాజ్యం
- నిబంధనలకు విరుద్ధంగా క్వార్టర్స్ కేటాయింపు
- క్వార్టర్స్ ఉన్న వారికే మరో క్వార్టర్ కేటాయింపు
- అద్దెకు సింగరేణి క్వార్టర్స్, ఏడాదికి 50 వేల రెంట్
- వెలుగులోకి వస్తున్న క్వార్టర్స్ భాగోతం
- విచారణలో అక్రమాలు బట్టబయలు
- దిద్దుబాటు చర్యలు చేపట్టిన సింగరేణి జీఎం

# ఆకునూరి సార్ రాక.. విద్యాశాఖలో కాక





### మొదటి పేజీ తరువాయి



ముఖ్యంగా ములుగు జిల్లా పరిధిలో ఉన్న అనేక మారుమూల గిరిజన గూడేలకు అప్పుడు కలెక్టర్‌గా ఉన్న ఆకునూరి మురళి ఆకస్మికంగా తనిఖీ చేసి వారి సాధక బాధలు తెలుసుకొని, ఆ సమస్యలు సత్వర పరిష్కారం దిశగా అధికారులను ఉరుకులు పరుగులు పెట్టించిన ఘనత ఉంది. ములుగు జిల్లాలోని మారుమూల గుత్తికోయ గూడేలలో నిదురించి వారి మనసు చురగొన్న ఈ రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ తెలంగాణ విద్యాకమిషన్ ఛైర్మన్‌గా నియామకం జరిగింది అన్న విషయంతో జిల్లాలో అదుపుతప్పిన విద్యా వ్యవస్థకి మెరుగైన ప్రణాళికలకు పథక రచన జరుపుకుంటున్న పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం పూర్తి ఏజెన్సీ ప్రాంతమైన ములుగు జిల్లాలో విద్యావ్యవస్థ నిర్లక్ష్యపు నీలినీడలు కమ్ముకున్నాయి. ఏ బడి చూసిన బండెడు సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఏజెన్సీలో విద్యను పటిష్టం చేయాల్సిన విద్యాశాఖ అధికారులు కొందరి అడుగులకు మడుగులొత్తుతున్నారు. గడిచిన పదేళ్లకాలంలో గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో ఏజెన్సీలో విద్యావ్యవస్థ అంపశయ్యపై ఉంది. పాఠశాలలో సమయపాలన లేక చదువుకునే పిల్లలను సక్రమ మార్గంలో పెట్టే గురువే.. కొన్ని పాఠశాలలో గుదిబండలా తయారయ్యాడు.. జిల్లా వ్యాప్తంగా కొన్ని పాఠశాలల్లో కనీస వసతులు కొరవడిన పరిస్థితి నెలకొంది. పాఠశాలలకు స్కావెంజర్లు లేకపోవడంతో అపరిశుభ్రత దర్శనం ఇస్తోంది. స్కావెంజర్ల నియమకాలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. ఉపాధ్యాయులు కొందరు సూదూర ప్రాంతాల నుండి రాకపోకలు సాగిస్తూ విద్యపై శ్రద్ధ పెట్టడం లేదనే ఆరోపణలు మిన్నంటుతున్నాయి. కొందరు ఉపాధ్యాయులు హన్మకొండ ప్రాంతం నుండి పాఠశాలలకు రాకపోకలు సాగిస్తూ సమయపాలన పాటించడం లేదు. ఇంకొందరు ఉపాధ్యాయులు ములుగు జిల్లా కేంద్రంగా ఇతర కార్యకలాపాలు సాగిస్తూ విద్యాశాఖకు మాయని మచ్చగా మారినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ నాయకులతో ఆంటకాగుతూ, సభలు, సమావేశాలు, పార్టీలకు హాజరవుతూ విధులకు డుమ్మకొడుతున్న పరిస్థితి జిల్లా విద్యాశాఖలో కొనసాగుతోంది. కొందరు ఉపాధ్యాయుల తీరు విమర్శలకు తావిస్తోంది. జిల్లా విద్యాశాఖ అధికారికి కొందరు ఉపాధ్యాయులు భసన చేస్తూ, పొగడ్తలతో కూడిన ప్రకటనలు ఇప్పించుకుంటున్నారనే వాదన బలంగా వినిపిస్తోంది. ఇంతకాలం అడవికాసిన వెన్నెలలా ఉన్న ములుగు జిల్లా ఏజెన్సీ విద్య రాష్ట్ర విద్య కమిషన్ ఏర్పాటుతో పురోగతి ఉంటుందనే ఆశాభావం ప్రజల్లో వ్యక్తం అవుతోంది. ఇప్పటివరకు ఆడిందే ఆట, పాడిందే పాటగా ఉన్న జిల్లా విద్యాశాఖ అధికారులకు విద్యాశాఖ ఛైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి రాక మింగుడు పడడం లేదు. ఆయన రాక ఏజెన్సీ విద్యాశాఖ అధికారుల్లో కాక రేపుతోందని విద్యాశాఖలో చర్చ జరుగుతోంది.

### అక్రమ డిప్యూటేషన్లపర్వం...?

అసలే అస్తవ్యస్తంగా ఉన్న ఏజెన్సీ విద్య పై 317 జిఓ రాకతో మూలిగే నక్కపైన తాటిపండు పడ్డ చందంగా జిల్లాలో పరిస్థితి మారింది. 317 జీవోతో జిల్లాకు వచ్చిన కొందరు ఉపాధ్యాయులు గత ప్రభుత్వంలో విధులకు డుమ్మకొడుతూ జీతం తీసుకున్న పరిస్థితి చూశాము. 317 జీవోతో జిల్లా వ్యాప్తంగా తీవ్రనష్టం వాటిల్లిందని ఉపాధ్యాయ వర్గాల నుండి ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారి మౌఖిక ఆదేశాలతోనే డిప్యూటేషన్ల పర్వం కొనసాగిందనే విమర్శలు వున్నాయి. ఈ అక్రమ డిప్యూటేషన్ల పర్వంలో అక్రమ వసూల్ దందా గట్టిగానే కొనసాగిందని నేడు కొనసాగుతోందని బాహాటంగానే విమర్శలు వ్యక్తమవడం చర్చనీయాంశం అవుతోంది. ఏజెన్సీ మండలాల్లో కాంప్లెక్స్ ఉపాధ్యాయుని ఆదేశాలు భేకతారు చేస్తూ విధులకు డుమ్మకొడుతున్న దుస్తితి నెలకొంది. విధులకు సరిగా రావడం లేదని మందలిస్తే నేను జిల్లా విద్యాశాఖ అధికారితో మాట్లాడుకుంటా లేదంటే మంత్రులతో మాట్లాడిస్తా అంటూ చిందులేస్తున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. అక్రమ డిప్యూటేషన్ల కోసం జిల్లా విద్యాశాఖ అధికారి దగ్గరకు కొందరు ఉపాధ్యాయులు మధ్యవర్తిత్వం వహిస్తూ తద్వారా గట్టిగానే జేబులు నింపుకుంటున్నారని ఉపాధ్యాయ వర్గాల్లోనే గుసగుసలు మొదలయ్యాయి. కాంప్లెక్స్ ఉపాధ్యాయుడు సదరు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయుల జీతాలు చేస్తున్న తరుణంలో అనేక ఒత్తిళ్లు, రాజకీయ పైరవీలు ఎదుర్కొంటున్న తీరు హాస్యాస్పదంగా వుంది. ఇలాంటి పరిణామాలు చూస్తే విద్యాశాఖలో రాజకీయ జోక్యం రాజ్యం మేలుతోందని స్పష్టం అవుతోంది. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించకూడదనే స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని జిల్లా విద్యాశాఖ అధికారి తుంగలో తొక్కుతున్నారనే విమర్శ వినిపిస్తోంది. ఏళ్ల తరబడి జిల్లా విద్యాశాఖలో తిష్టవేసిన ఉపాధ్యాయులను పాఠశాలలకు పంపిచాలని ఉపాధ్యాయ సంఘాల నుండి డిమాండ్లు వెలువడుతున్నాయి. అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేసి ఏకోపాధ్యాయ పాఠశాలలకు కేటాయించి విద్యావ్యవస్థను పటిష్టం చేయాలని మరో ప్రక్క ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

### పాఠశాలలపై కొరవడిన పర్యవేక్షణ..?

500లకు పైగా మండల విద్యాశాఖాధికారులు, 60కి పైగా డిప్యూటీ డిఈఓ పోస్టులు, 30 దాక జిల్లా విద్యాశాఖ అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్న తరుణంలో విద్యా ప్రస్తుతం పురటినొప్పులు పడుతోందనే నిజాన్ని కూడా గుర్తించ కుండా ఉండలేము. ఇక జిల్లా విద్యావ్యవస్థలో పర్యవేక్షణ మరింత కొరవడింది అనే చెప్పాలి. పర్యవేక్షణ లోపంతో కొందరు ఉపాధ్యాయులు పాఠశాలలపై దృష్టి పెట్టకుండా.. ఇతర లావాదేవీలు, వ్యాపారాలు, రాజకీయాల్లో క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు అనే వాదనలు ప్రజల నుండి బాగానే వినిపిస్తున్నాయి. అనధికారిక సేవలతో కొందరు ఉపాధ్యాయులు విధులకు డుమ్మా కొడుతున్న తీరు విద్యార్థుల తల్లితండ్రుల నుండి విమర్శలకు కారణం అవుతోంది. కొందరు స్థానికేతర ఉపాధ్యాయుల బాధ్యత రాహిత్యం కారణంగా స్థానిక ఉపాధ్యాయులపై ప్రభావం చూపుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యపు ఆనవాళ్లు ప్రస్తుత ప్రభుత్వం తుడిచిసే ప్రయత్నం చేస్తూ ఉండడం హర్షనీయం కానీ పూర్తి స్థాయిలో విద్యను పటిష్టం చేయాలి అంటే విద్యా వ్యవస్థపైన ఖచ్చితంగా పర్యవేక్షణ ఉండాలి అని విద్యావేత్తలు, మేధావులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల విద్యపైన పర్యవేక్షణ కొరవడితే ఏజెన్సీ విద్య మిద్యే అవుతుంది. దీని కారణంగా విద్య వ్యవస్థ మరింత దిగజారే ప్రమాదం లేకపోలేదు అనే వాస్తవాన్ని జిల్లా పరిపాలన అధికారి దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి ఒక్క సమస్యను నిశితంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి సత్వరమే ప్రణాళిక రూపొందించే సత్తా కలిగిన రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ ఆకునూరి మురళి విద్యాకమిషన్ ఛైర్మన్‌గా విద్యావ్యవస్థలో సమూల మార్పులు చేపడతారని ఏజెన్సీ ప్రాంత ప్రజలంతా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ములుగు జిల్లా నుండే అణగారిన విద్యా వ్యవస్థ ప్రక్షాళన బీజం వేయాలని ప్రజలంతా కోరుతున్నారు.

## తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి రూ. 50,000 ల ఆర్థిక సహాయం



**వరంగల్, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త :**

తలసేమియా వ్యాధితో బాధపడుతున్న హసన్‌పర్తి మండలం కోమటిపల్లి తండాకు చెందిన బానోతు ప్రేమలత రాజేష్‌ల కూతురు చిన్నారి ప్రతీక్షకు వైద్య ఖర్చుల నిమిత్తం విద్యఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ రూ.50,000/- (యాభై వేలు)ల చెక్ అందజేసి ఆర్థికంగా చేయూతనిచ్చింది. హన్మకొండ, వడ్డేపల్లిలో గల ఒయాసిస్ అనాథాశ్రమంలో జరిగిన కార్యక్రమంలో కవి, ఉపాధ్యాయుడు, ఫౌండేషన్ వ్యవస్థాపకులు బిల్ల మహేందర్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన చిన్నారి ప్రతీక్ష పరిస్థితి ఆరోగ్యరీత్యా ఆందోళనంగా ఉన్న విషయాన్ని తల్లిదండ్రుల ద్వారా తెలుసుకొని దాతల సహకారంతో ఫౌండేషన్ నుండి సహాయాన్ని అందించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తలసేమియా వ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు అవసరమైన ప్రణాళికను ఏర్పాటు చేసినట్లైతే ఎంతో మంది చిన్నారులకు లబ్ది చేకూరుతుందని అన్నారు. ఈ సందర్భంగా స్పందించిన దాతలకు ధన్యవాదాలు తెలియజేశాడు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మరియు దాతలు అప్పాల శకుంతల, గజ్జెల స్వరూపరాణి, రామోజ్జల సురేఖ, మద్దెర్ల అనిత, కాంచనపల్లి అనిత, వైద్యం వాణి రాణి, మహ్మద్ రఫి, కార్తీక రాజు, కొక్కుల కృష్ణ, కడుదుల సోమన్న, మంద చంద్రశేఖర్, అనుమాండ్ల విద్యాసాగర్, ఎం. వెంకట్రాజం, ఒద్దిరాజు ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

బిల్ల మహేందర్, వ్యవస్థాపకులు, విద్యఫౌండేషన్, వరంగల్ 9177604430

> ప్రభుత్వం తలసేమియా వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలి.
>
> ............................
>
> బిల్ల మహేందర్,
> వ్యవస్థాపకులు,
> విద్యఫౌండేషన్

## గణేష్ పూజకు మట్టి ప్రతిమలనే వినియోగించాలి

### అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

**జనగామ టౌన్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :**



వినాయక చవితి పండుగను పురస్కరించుకుని నిర్వహించే గణేష్ పూజకు మట్టి ప్రతిమలనే వినియోగించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం నెహ్రూపార్కు వద్ద లయన్స్‌క్లబ్ ఆఫ్ జనగామ డైమండ్స్ ఆధ్వర్యంలో ఉచిత గణేష్ మట్టి ప్రతిమల పంపిణీ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున లింగయ్య తో కలిసి అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ పాల్గొని భక్తులకు మట్టితో తయారుచేసిన గణేష్ విగ్రహ ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛంద సేవా సంస్థలు అందిస్తున్న సేవలను కొనియాడుతూ భక్తులుకూడా పర్యావరణ హితం కోరుకోవాలని, రంగులతో తయారుచేసిన విగ్రహాలను వినియోగించరాదని, జలజీవరాశులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రంగులు వివిధ రసాయనాలతో ఉంటూ జలాన్ని కలుషితం చేస్తాయని, జీవరాశులు నశించిపోతాయన్నారు. మట్టి ప్రతిమల వల్ల మట్టి నీటిలో కరిగిపోతుందని, తద్వారా జీవరాశులకు ప్రమాదం ఉండదని, వాతావరణం పరిరక్షింపబడుతుందన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# ఆ రేషన్ బియ్యం అమ్మిన డీలర్ ఎవరు..?

**-గణపురంలో 172క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత**

**-పట్టుబడిన బియ్యం విలువు రూ.6లక్షల71వేలు**

**-ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ సంచులతోనే నిల్వ**

**-ఎస్ఐ అశోక్ సిబ్బందితో కలిసి దాడుల్లో వెలుగులోకి**

**-ఇద్దరిపై కేసు నమోదు**

*గణపురం, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త*

మండలకేంద్రంలో అక్రమంగా నిల్వచేసిన 172క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గణపురం ఎస్ఐ రేఖ అశోక్ తన సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నారు. మండలకేంద్రానికి సమీపంలోని కొత్తపల్లి ఇండ్లలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచినట్లు



పోలీసులకు సమాచారం అందింది. దీంతో స్థానిక ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈమేరకు తూర్పాటి శంకర్, పస్తం సారయ్య పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా వ్యాపారం చేస్తూ ఒక ఇంట్లో రూ.4,86,330ల విలువ గల 124.70క్వింటాళ్ల బియ్యం, అదేవిధంగా అద్దె ఇంట్లో నిల్వ ఉంచిన రూ.లక్ష84వేల విలువ చేసే 47.40క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. ఈబియ్యం ఇద్దరు తామే నిల్వ ఉంచినట్లు చెప్పడంతో వారి నుచి 172క్వింటాళ్ల బియ్యం స్వాధీనపర్చుకుని వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. స్వాధీనపర్చుకున్న బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు అందించినట్లు ఎస్సై తెలిపారు. ఈసందర్భంగా ఎస్సై అశోక్ మాట్లాడుతూ..ఎవరైనా రేషన్ బియ్యాన్ని కొనగుఒలు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన, తరలించిన సమాచారం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

-పేదల బియ్యాన్ని అమ్మిన ఈ డీలర్ ఎవరు..?

నిరుపేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం అక్రమంగా అమ్ముకున్న డీలర్లు ఎవరూ అనేది మండల వ్యాప్తంగా చర్చని అంశంగా మారింది. మండలకేంద్రం శివారు కొత్తపల్లిలో జరిగిన పోలీసుల దాడుల్లో వ్యవహారం బట్టబయలైంది. దాడుల్లో పట్టుకున్న 172క్వింటాళ్ల బియ్యంలో ప్రభుత్వం పంపిణీ చేసిన సంచులను సీల్ తియ్యని 356పీడీఎస్ బియ్యం సంచులు లభ్యమవ్వడంతో పోలీసులు, అధికారులు అవాక్కయ్యారు. సంచులపై ఉన్న సమాచారం గణపురం, వెంకటాపూరం మండలానికి చెందిన ఏడీలర్లు విక్రయించి ఉంటారనే కోణంలో విచారణ చేస్తున్నట్లు పోలీసులు, రెవెన్యూ అధికారులు తెలిపారు.

## నేరాలు-దారుణాలు

## పిడుగుపాటుకు వ్యవసాయ కూలీ మృతి

*భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త*



జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలంలోని శ్యాంనగర్ గ్రామంలో పిడుగుపాటుతో మహిళ మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. శనివారం వ్యవసాయ పనులలో భాగంగా మిరప నారు పెడుతుండగా ఆకస్మికంగా ఒక్కసారిగా భారీ వర్షం కురియడంతో పాటు పిడుగుపాటుకు గురై పొనగంటి సులోచన(44) అక్కడికక్కడే మృతి చెందింది. సులోచనతో పాటు మరో ముగ్గురు పని చేస్తుండగా వారు తీవ్ర అస్వస్థకు గురవడంతో సమీపంలో ఉన్నవారు ఆసుపత్రికి తరలించారు. కాగా చనిపోయిన సులోచనకు భర్తతో పాటు కూతురు, కొడుకు ఉన్నారు.

## సమాచార హక్కు చట్టం పౌరునికి ఆయుధం

*చెన్నారావుపేట, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త*



అవినీతిని అంతమొందించి సంక్షేమ పథకాలు పేదలకు అందించాలంటే పౌరులకు సమాచార హక్కు చట్టం ఒక ఆయుధంలాగా వాడుకోవాలని సమాచార హక్కు చట్టం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలువేరు కరుణాకర్ అన్నారు. మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో సమాచార హక్కు రక్షణ చట్టం మండలం కమిటీ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు మరిముఖ్యంగా యువత సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన కలిగి ఉండాలని, గ్రామస్థాయి నుండే ఆర్టీఐలు వేస్తూ గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగే కార్యనిర్వహణ పనులను పరిశీలించాలని, తెల్ల కాగితంపై సమాచార హక్కు చట్టం 2005 సెక్షన్6(1) కింద సమాచారం. సెక్షన్2(జె)(2) ప్రతి పేజీని దృవీకరించి సమాచారం ఇవ్వగలరని రాసిన ఆ అధికారి మీకు సమాచారం ఇవ్వాలని, దరఖాస్తు చేసిన 30 రోజుల్లో సంబంధిత అధికారి మీకు సమాధానం అందించాలని లేదంటే చట్టపరంగా చర్యలు చేపట్టొచ్చని, ఏ ప్రభుత్వం కార్యాలయంలోనైనా సమాచారం పొందే హక్కు ఉందని ఆర్టీఐ వేసే విధంగా సంబంధిత సెక్షన్ల యువకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపాధ్యాయులు పులి దేవేందర్ మండల అధ్యక్షులు కల్లెపు గణేష్, కలామ్స్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు పరికి మధుకర్, ఆర్టీఐ రిపోర్టర్ కల్లెపు ప్రణీత్, ఉప్పరపల్లి కలామ్స్, ఫౌండేషన్ అధ్యక్షులు ఎండి బాష్మియా, అండె వెంకటేశ్వర్లు, వట్టే తిరుపతిరెడ్డి, కలామ్స్ అడ్వైజర్ ఉడుగుల రాజు, పప్పు శ్రీపాల్, ఉడుగుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు

*ఖానాపురం, సెప్టెంబర్ 8,ప్రభాతవార్త*

అక్రమంగా గుడుంబా ప్యాకెట్లను రవాణా చేస్తున్న వ్యక్తులను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రఘుపతి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నాజితండా క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా భూక్య గణేష్ బోడ సరోజలు అనుమానస్పదంగా కన్పించడంతో వారి వాహనాలను ఆపి తనిఖీ చేయగా వారి వాహనంపై 26 ప్యాకెట్ల గుడుంబా ఉందని, మొత్తం 39 లీటర్ల గుడుంబాను సీజ్ చేసి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



## పంటలను దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి


*చెన్నారావుపేట, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త*



అకాల వర్షాల కారణంగా పంటలను, పంట దిగుబడి నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) సిపిఎం మండల కమిటీ సభ్యులు పరికి మధుకర్ అన్నారు. చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి, కాల్‌నాయక్‌తండా గ్రామాలలో పత్తి, మిర్చి పంటలను వారు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల అకాల వర్షాలు కురుస్తూ రైతులను తీవ్ర ఇబ్బందులను గురి చేస్తున్నాయని వారు అన్నారు. ఒక ఎకరానికి 10 నుండి 20 క్వింటాళ్ల పత్తి పండుతుందని ఆశాభావంతో ఉన్నటువంటి రైతు కళ్ళలో అకాల వర్షం కన్నీరు మిగిల్చిందని ఆయన అన్నారు. వ్యవసాయ అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం కుర్చీలను పరిమితం కాకుండా గ్రామాలలో పంట సర్వే నిర్వహించి రైతు, రైతన్నను ఆదుకోవాలని ఈ కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు పప్పు వెంకన్న, గుగులోతు లక్ష్మణ్, సమ్మలు, పప్పు శ్రీపాల్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాళోజీ సేవలు మరువలేనివి

*నర్సంపేట, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త*



తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమంలో కాళోజి నారాయణరావు అందించిన సేవలు మరువలేనివని ఏబీవీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ అన్నారు. ఆదివారం బీసీ కళాశాల వసతి గృహంలో కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమానికి ఉత్తం ఇవ్వడం జరిగిందని వారి రచనల స్ఫూర్తితో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు 2009 నవంబర్ కేసీఆర్ అమర నిరాహార దీక్ష సందర్భంగా కాళోజి నారాయణరావు రచనల ద్వారానే విద్యార్థులు మలి దశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించడం జరిగిందన్నారు. తద్వారా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సంక్షేమ అధికారి పావని, ప్రవళిక, వినోద్, ప్రశాంతి కావ్య అనిత తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు శివ కుటుంబానికి లక్ష చెక్కు అందజేత

*ఖానాపురం, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త*



మండలానికి చెందిన మనేపల్లి శివ అనే జర్నలిస్టు గతంలో మృతిచెందగా ఆయన కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఆర్థిక సహాయం అందించారు. ఆదివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్న ప్రజాపాలనలో జర్నలిస్టు సంక్షేమ కార్యక్రమంలో మృతిచెందిన పలువురు జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. ఇందులో భాగంగా మానెపల్లి శివ భార్య లతకు రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా రూ.1లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐజేయు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కోదాటి గోపాల కృష్ణ, ఐజేయు నాయకులు శీలం రమేష్, తోట సుధాకర్ తదితరులున్నారు.

## ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు

*ఖానాపురం, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త*

వినాయకచవితిని పురస్కరించుకొని మండల ప్రజలందరు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణపతి విగ్రహాలను వాడవాడన మండపాలను ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను ప్రతిష్టించారు. ఉదయం నుండి భక్తులందరు నూతన వస్త్రాలను ధరించి వినాయకుడికి బ్రహ్మాండంగా పూజలు అందించారు. మండల కేంద్రంతో పాటు 20 గ్రామపంచాయతీల పరిధిలో గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు.

## నల్లబెల్లి తహసీల్దార్‌గా కృష్ణ

*నల్లబెల్లి, సెప్టెంబర్ 8,ప్రభాతవార్త*



నల్లబెల్లి మండల తహసీల్దార్‌గా ముప్పు కృష్ణ బాధ్యతలు చేపట్టారు. గతంలో నల్లబెల్లి తహసీల్దార్‌గా పనిచేసిన రాజేష్ బదిలీపై నర్సంపేట మండలానికి వెళ్లగా ఆయన స్థానంలో పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన ముప్పు కృష్ణ పదోన్నతిపై నల్లబెల్లి తమసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలు తమ పనుల కోసం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తగు సహాయం పొందాలని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి పైరవీలు లేకుండా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఆయన మండల ప్రజలను కోరారు.

## రాజన్నకు రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం

మొగుళ్లపల్లి, సెప్టెంబర్ 8, (ప్రభాతవార్త)



రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అందజేసే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారమును మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గుండెల్లి రాజయ్య అందుకున్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు క్రీడల్లో ఉత్తమ ప్రదర్శనను ఇచ్చే విధంగా అనునిత్యం తర్ఫీదూ ఇస్తూ, ఎక్కడ క్రీడాపోటీలు జరిగినా మొదటి బహుమతి వచ్చే విధంగా వారికి మెలకువలు నేర్పుతూ పాఠశాలకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకువచ్చే వారని, అటు వ్యాయామ, ఎన్‌సిసి ఉపాధ్యాయుడుగా ఎంతో విలువైన సేవలను అందిస్తూ పలువురు మన్ననలను చురగొన్నారన్నారు. రాజయ్యకు అవార్డు రావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు పింగిలి విజయపాల్ రెడ్డి మాట్లాడుతూ..తమ పాఠశాలకు చెందిన రాజయ్యకి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం గర్వకారణంగా ఉందన్నారు.

## ఎడపల్లిలో అక్రమ మద్యం పట్టివేత

మహదేవపూర్(కాటారం), సెప్టెంబర్ 8, (ప్రభాతవార్త)

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని ఎడపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి కృష్ణ ఇంటి వద్ద సుమారు 16బీర్లను మహదేవపూర్ పోలీసులు పట్టుకున్నారు. మహదేవపూర్ ఎస్సై కె.పవన్ కుమార్ వివరాల మేరకు ఎడపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి కృష్ణ ఇంటి వద్ద బీర్లను నమ్మదగిన సమాచారం మేరకు ఇంటిలో తనిఖీలు చేయగా 16బీర్లను స్వాధీనం చేసుకొని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను అందించిన ఎస్సై

కాటారం, సెప్టెంబర్ 8, (ప్రభాతవార్త)



కాటారం మండలంలోని వివిధ ప్రాంతాలల్లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సంబంధిత బాధితులకు సిఈఐఆర్ టెక్నాలజీతో కనుక్కొని ఆదివారం కాటారం ఎస్సై మ్యాక అభినవ్ అందజేశారు. కాటారంకు చెందిన జిల్లాల శ్రీశైలం, గంగారంకు చెందిన చిట్యాల సమ్మయ్య, మల్లారంకు చెందిన దుర్గం రఘు, కొర్లకుంటకు చెందిన క్రిష్ణలకు సంబంధించిన సెల్‌ఫోన్‌లను కాటారం ఎస్సై మ్యాక అభినవ్ అందజేశారు. ఈసందర్భంగా సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న వారు ఎస్సై అభినవ్‌కు, పోలీసు సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆర్యవైశ్య మహాసభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

జనగామ టౌన్, సెప్టెంబరు 8 (ప్రభాతవార్త) :

జనగామ జిల్లా 2024-26సంవత్సరాలకు సంబంధించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు గాను రాష్ట్ర అధ్యక్షుల సూచన మేరకు జిల్లా అధ్యక్షులు పార్శి కమల్ ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేయడం జరిగిందని ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధానకార్యదర్శి జైన రమేష్, కోశాధికారి అయిత బుచ్చిబాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 24వ తేదీ(మంగళవారం) నామినేషన్ సమర్పణ, పరిశీలన జరుగుతుందని, ఈనెల 25వ తేదీ ఉపసంహరణ తుది జాబితా ప్రకటన నిర్వహించబడుతుందని, అనంతరం ఈనెల 28వ తేదీ(శనివారం) ఎన్నికలు నిర్వహించబడుతాయని తెలిపారు. ఎన్నికల్లో పాల్గొనే వారు షెడ్యూల్ ప్రకారం రాష్ట్ర నియమావళి సూచనల ప్రకారం ఎన్నికల్లో పాల్గొనవచ్చునని తెలియచేశారు. జిల్లా కౌన్సిల్ సభ్యులు అందరూ ఎన్నికల షెడ్యూల్‌ను పరిశీలించి తదనుగుణంగా ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేందుకు సహాయ సహకారాలు, బాధ్యతను అందించాలని వారు కోరారు.

## నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్

నెక్కొండ, సెప్టెంబర్ 8, (ప్రభాతవార్త)



మండలంలోని అప్పలరావుపేట గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఎలికట్టె నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ (ఎన్‌హెచ్ఆర్‌సి) వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా అధ్యక్షులు చంద్రగిరి సునీల్‌కుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. సమావేశంలో భాగంగా జిల్లా అధ్యక్షులు సునీల్‌కుమార్ మాట్లాడుతూ గత పదిహేను ఏళ్ళుగా విద్యారంగంలో పనిచేస్తూ, విద్యావేత్తగా, తనదైన శైలిలో సమకాలీన అంశాలపై పోరాటం చేస్తూ, అవినీతి జరిగిన సందర్భాల్లో ప్రశ్నించే వ్యక్తి శ్రీనివాస్ అని అన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి పౌరుడికి న్యాయంగా దక్కాల్సిన హక్కులపై సమాజంలో జరిగే అవినీతి, అక్రమాలు, హింసపై బాధ్యతగా పోరాటం చేస్తానని అన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు బద్దిపడిగ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు చంద్రగిరి సునీల్‌కుమార్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాణా ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో బిజెపిలోకి చేరికలు

నెక్కొండ, సెప్టెంబర్ 8,(ప్రభాతవార్త)



పలువురు నాయకులు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి రాణా ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బిజెపిలో చేరారు. మండలంలోని మహేశ్వరం గార్డెన్స్‌లో బిజెపి నెక్కొండ మండల అధ్యక్షులు నాయిని అశోక్ అధ్యక్షతన జరిగిన చేరికల కార్యక్రమంలో సూరిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు చార్ల సుధీర్‌రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ శల్వాది యశోద, బీఆర్ఎస్ నాయకులు శల్వాది ఎల్లయ్య, పార్టీ సీనియర్ నాయకులు శల్వాది కొమురయ్య, పార్టీ యూత్ నాయకులు పబ్బతి ప్రవీణ్, మంజుల, స్వామి, పిట్టల సురేష్, సొల్లేటి వెంకన్న, గొలుసుల నర్సయ్య, కోల మహేష్, గోవింద్ కట్టయ్య, ఎన్నం నిఖిల్, విజయ్‌కుమార్, యశ్వంత్ తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కో కన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగం సాగర్, జిల్లా కార్యవర్గ సభ్యులు సింగారపు సురేష్, కనపర్తి సతీష్, పార్టీ సీనియర్ నాయకులు తాళ్లూరి లక్ష్మీనారాయణ, మోహన్‌రెడ్డి, శ్రీరంగం శ్రీనివాస్, దామచర్ల రామారావు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన భూమి పూజ

భీమదేవరపల్లి, సెప్టెంబర్ 08, (ప్రభాతవార్త) :

కొప్పూరు గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట భూమి పూజ మహోత్సవం జరిగింది. శనివారం రోజున అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట కమిటీ ఆధ్వర్యంలో భూమి పూజను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారులు కొమ్ముల రమేష్, మొగిలి భిక్షపతి, చక్రపాణి నాగరాజు, వీరస్వామి, సదానందం, వీరస్వామి, రాజయ్య, లింగయ్య, కొమ్ముల రవీందర్, కమిటీ సభ్యులు కొమ్ముల రాజు, గడిపె ఐలయ్య, కుమారస్వామి, నగేష్, ప్రసాద్, కొమురయ్య, బిక్షపతి, రవీందర్, మంచ రవీందర్, రాజమౌళి, కృష్ణ వంశీ, సలహాదారులు తదితరులు పాల్గొన్నారు.







కాటారం,కాళేశ్వరం, మల్హర్‌రావు, మహాముత్తారం

## అక్రమాలకు పాల్పడుతున్న డీలర్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

### -బీజేవైఎం రాష్ట్ర నాయకులు మంద మహేష్

గణపురం, సెప్టెంబర్ 8, (ప్రభాతవార్త)



గణపురం మండల పరిధిలోని అన్ని గ్రామాలలో డీలర్ షాపులలో పేద ప్రజలకు పంపిణీ చేయవలసిన రేషన్ బియ్యంను డీలర్లు అక్రమంగా అమ్ముకుంటున్న వారిని వెంటనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని బీజేవైఎం రాష్ట్ర నాయకులు మంద మహేష్ డిమాండ్ చేశారు. అధికారులు రేషన్ డీలర్లపై చర్యలు తీసుకోకున్నట్లయితే భారతీయ జనతా పార్టీ తరపున నిరసన కార్యక్రమాలు చేయడం జరుగుతుందని మంద మహేష్ అన్నారు.

## వాడవాడలా కొలువుదీరిన గణపయ్యాలు

### -ప్రత్యేక ఆకర్షణగా మట్టి విగ్రహం

చిట్యాల, సెప్టెంబర్ 8, (ప్రభాతవార్త)



మండల వ్యాప్తంగా వినాయక చవితిని పురస్కరించుకొని విఘ్నేశ్వరుడి విగ్రహాలు వాడవాడలా వెలిశాయి. శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి, గణనాథులను ఆయా మండపాలలో ప్రతిష్టించారు. మండలకేంద్రంలో వర్తక సంఘం, ప్రసన్నాంజనేయ స్వామి కమిటీ ఆధ్వర్యంలో, మున్నూరు కాపు సంఘం, చింతలపల్లి, వెంకట్రావుపల్లి, మహారాజుల కాలనీల ఆధ్వర్యంలో గణపనాథులను ప్రతిష్టించారు. మాజీ ఎంపిటీసీ కటుకూరి పద్మ-నరేందర్ కుమారుడు ప్రణయ్ కుమార్ ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడు మండల వ్యాప్తంగా ఆకర్షణగా నిలిచింది.

## లక్ష్మారెడ్డిపల్లి గ్రామంలో నాగుపాము హల్‌చల్

గణపురం, సెప్టెంబర్ 8, (ప్రభాతవార్త)



గణపురం మండలం లక్ష్మారెడ్డిపల్లి గ్రామంలో మిట్ట మధ్యాహ్నం మొగిలి శంకర్ ఇంట్లో సుమారు నాలుగు గంటల పాటు నాగుపాము హల్చల్ చేసింది. భూపాలపల్లికి చెందిన పాములు పట్టే రహిమాను పిలిపించి పామును పట్టుకోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

## ముసురు వానలకు కూలిన ఇంటిగోడ

చెన్నారావుపేట, సెప్టెంబర్ 8, (ప్రభాతవార్త)

మండలంలోని పదహారుచింతల్ తండా గ్రామంలో బానోతు హరిలాల్‌కు చెందిన ఇంటి గోడలు కూలినట్లు స్థానికులు తెలిపారు. గత రెండు రోజులుగా కురుస్తున్న ముసురు వానలకు పూరి గుడిసెలు పెంకుటిల్లు తడిసి మద్దవుతున్నాయన్నారు. ఈ క్రమంలోనే హరిలాల్‌కు చెందిన ఇంటిగోడలు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో సైతం పూరి గుడిసెలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయంటున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని పలువురు కోరుతున్నారు.

# అసత్య ప్రచారాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ

## - మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్

*ప్రభాతవార్త- బాలసముద్రం:*



బిఆర్ఎస్ పాలనలో మేము చేసింది చెప్పుకోలేక పోయామని కాంగ్రెస్ వాళ్లు చేయంది కూడా చెప్పుకుంటూ అసత్య ప్రచారాలు చేస్తున్నారని మాజీ చీఫ్‌విప్ బిఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఆదివారం బాలసముద్రం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేస్తున్న ప్రారంభోత్సవాలు, ఉద్యోగనియామకాలు అన్ని కేసిఆర్ ఇచ్చినవే ఫోటోలకు ఫోజులు మాత్రం కాంగ్రెస్ ముఖ్యమంత్రి ప్రజాప్రతినిధులు ఇస్తున్నారన్నారు. అవగాహన లేని, కాళోజి గురించి తెలవని, కాళోజి మిత్ర మండలితో సంబంధం లేని అడ్డిమారి గుడ్డి దెబ్బలో గెలిచిన ఇక్కడి స్థానిక ఎమ్మెల్యే ఏమేమో మాట్లాడుతున్నాడన్నారు. కాళోజి కళాక్షేత్రం బీజం నాటింది బీఆర్ఎస్ పార్టీనే... నాడు కాళోజి మిత్రమండలి నవీన్, విద్యార్థి అశోక్, రామశాస్త్రి లాంటి కవులు కాళోజి స్మారక కేంద్రం కేంద్రం కావాలని అడిగారు. ఆనాడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు స్కూల్ ఆడిటోరియంలో కాళోజి జయంతి ఉత్సవాలు చేస్తుంటే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంకి వరంగల్ డీఐజి బిల్డింగ్ ఎదురుగా గల 300 గజాల ప్రభుత్వ స్థలం ఇవ్వాలని కోరారు. వారితో కలిసి నాటి మున్సిపల్ కమీషనర్ కలెక్టర్ మంత్రి ముఖ్యమంత్రిలను కాళ్ళ చెప్పులు అరిగేలా తిరిగాం, నాడు పాలకులు కోరాము చూద్దాం, చేద్దాం అన్నారే తప్ప స్థలం ఇవ్వలేదు. ఈ విషయంలో నాడు 2012లో కేసిఆర్‌ని కలవడం జరిగింది. తెలంగాణ ఏర్పడగానే రవీంద్రభారతిని తలదన్నేలా 300 గజాల్లో కాదు 3000 గజాల్లో కాళోజి కళాక్షేత్రం నిర్మిద్దాం అని కేసిఆర్ అన్నారు. అన్నట్లుగానే కాళోజి కళాక్షేత్రం పెద్ద స్థాయిలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించడం జరిగింది. కాళోజి కళాక్షేత్రం నిర్మాణంలో కాళోజి ఫౌండేషన్ సభ్యుల సలహాలు, కవులు, కళాకారుల సూచనలు తీసుకోవడం జరిగిందన్నారు. నిర్మాణం పూర్తి చేయడంలో కొంత ఆలస్యం జరిగినా 90 శాతం పనులు బిఆర్ఎస్ హయాంలోనే పూర్తి చేయడం జరిగిందన్నారు. నిర్మాణ బాధ్యత సంస్థలు మార్చడం వల్ల కరోనా వల్ల, ఎలక్షన్స్ కోడ్ వల్ల నిర్మాణం ఆలస్యమైన మాట వాస్తవం అని అన్నారు. మిత్రుడు నాయిని రాజేందర్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడని అన్నారు. కాంగ్రెస్ చర్యలను ఓపికతో సహనంతో భరిస్తున్నామని అన్నారు. ఉద్యమ సమయంలో ఎన్నో కేసులు, అరెస్టులకు భయపడలేదని అన్నారు. అధికారం ఉన్నా లేకున్నా ప్రజల మధ్య ఉంటామని అన్నారు. ప్రజల తరుపున కొట్లాడుతాం ప్రశ్నిస్తామని తెలిపారు. కాళోజి కళాక్షేత్రాన్ని కవులకు, కళాకారులకు అందుబాటులో ఉంచాలని, వారికి ప్రత్యేక గదులను కేటాయించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పోలీసులను అడ్డుపెట్టుకొని నడుపుతోందని విమర్శించారు. కాంగ్రెస్ పాలన ఎలా సాగుతోంది అంటే నేను వేసిన శిలాఫలకాన్ని పగలగొట్టి కొత్త శిలాఫలకాలు వేస్తూ... ఫోటోలకు ఫోజులు కొడుతూ ఫోటోలు దిగుతున్నారు. పశ్చిమ నియోజకవర్గం సరిహద్దులు కూడా ప్రస్తుత ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి తెలియదు, అవగాహన లేకపోతే అవగాహనా తెచ్చుకొని మాట్లాడమని రాజేందర్‌రెడ్డిని కోరుతున్నారు. మాజీ కూడా చైర్మన్ యాదవరెడ్డిని పట్టుకొని ఎమ్మెల్యే తొర్రి... మొర్రి అని వ్యంగంగా మాట్లాడుతున్నాడు అలా మాట్లాడడం సబబు కాదు. మేము కూడా మాట్లాడాల్సి వస్తదన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ కూడా చైర్మన్ యాదవరెడ్డి, రాష్ట్ర రైతు రుణ విమోచన సమితి మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్లు పులి రజినీకాంత్, నాయకులు నాయిమోద్దిన్, రమేష్, సంపత్‌రెడ్డి, రవీందర్‌రావు, శరత్, వీరు, రాజ్‌గోపాల్, మహేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యేకి మహానాటుడు అవార్డు ఇవ్వాలి

## -వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని

*ప్రభాతవార్త- బాలసముద్రం:*

కమీషన్ల కోసం అభివృద్ధికి ఆటంకంగా నిలిచి కబ్జాలు చేస్తూ మహానగరాన్ని భ్రష్టు పట్టించి అన్నీ తానై చేసి నేడు చిలక పలుకులు పలికే మాజీ ఎమ్మెల్యే మహానటుడు అవార్డు ఇవ్వాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాళోజి కళాక్షేత్రం గత పాలకుల చేతుల్లో కమీషన్ల కోసం కకృత్తి కోసం జాప్యం చేసి తొమ్మిది ఏళ్ల గడిపారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఎనిమిది నెలల్లోపై ప్రారంభించడానికి సిద్దంగా చేశామని అన్నారు. 95 కోట్లు నిధులు కేటాయిస్తూ గత ప్రభుత్వం చేసనప్పటికి కేవలం 10 కోట్ల నిధులు అందించి పనులు నిర్మాణానికి జాప్యంగా నిలిచారు. నిర్మాణంలో దీనస్థితిలో ఉన్న కాళోజి కళాక్షేత్రానికి నేడు పునర్ వైభవం తీసుకువచ్చామంటే ఇది కేవలం మా కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రుల యొక్క సహకారంతోనే గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడు నెలలు పార్లమెంట్ ఎన్నికలో గడిచిపోయినప్పటికి మిగిలిన సమయంలోనే యుద్ధ ప్రాతిపాదికన పనులను వేగవంతం చేశామని రోజువారిగా 380మంది కూలీలు నిత్యం పనుల్లో పాల్గొన్నారన్నారు. నిర్మాణ పర్యవేక్షణ పట్ల రాష్ట్ర మంత్రివర్యులు, నగర మేయర్, కూడా చైర్మన్, మాజీ కలెక్టర్ కమీషనర్ మేమందరము ఎప్పటికప్పుడు పర్యవేక్షణలు చేశామని పేర్కొన్నారు. నయిామ్‌నగర్ బ్రిడ్జి నిర్మాణం పట్ల పక్క నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు మాట్లాడుతుంటే దయ్యాలు వేదాల వర్ణించినట్లు ఉందని అన్నారు.



# గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

*భీమదేవరపల్లి, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త :*



గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివవారం రోజున మండల పరిధిలోని తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన వీరభద్ర దేవాలయంలో వంగర శివాలయంలో మేజర్ గ్రామపంచాయితీ ముల్కనూర్ పాత శివాలయంలో గట్ల నర్సింగాపూర్ దేవాలయంతో పాటు అన్ని గ్రామాలలో వాడవాడలా యువజనులు ఆనంద ఉత్సవాలతో గణపతి విగ్రహాలను బ్యాండ్ మేళ నృత్యాలతో అర్చకుల పూజలతో నవరాత్రి ఉత్సవాలను ఉత్సాహంగా ప్రారంభించారు. గణపతి భక్తులు జైబోలో గణేష్ మహారాజ్‌కి జై అంటూ నినాదాలు చేస్తూ తమ కోరికలు నెరవేర్చాలంటూ ప్రత్యేక పూజలు జరిపి నవరాత్రి గణపతి విగ్రహాలను ప్రతిష్టాపన చేశారు.

# బాధితులను మాజీ మంత్రి పరామర్శ

*భీమదేవరపల్లి, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త :*



భీమదేవరపల్లి మండలంలోని మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి పరామర్శించారు. ఆదివారం రోజున మండలంలోని బిఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షులు మారుపాటి మహేంద్రరెడ్డిని ముల్కనూర్‌లోని మాజీ ఎంపిటీసీ అప్పని పద్మ బిక్షపతి దంపతులను అవ్వాల్దర్పల్లె గ్రామంలోని కత్తుల మల్లయ్యను ముస్తాపూర్ గ్రామంలోని ఏనుగు సుధాకర్ రెడ్డితోపాటు ఎర్రబెల్లి గ్రామంలోని డాక్టర్ భద్రయ్య కుటుంబాన్ని అనుచర గనంతో బాధిత కుటుంబాలను మరణించిన వారి సమాచారంను తెలుసుకొని మాజీ మంత్రి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నవాబ్ పాషా, గడ్డ సమ్మయ్య, గూడ రాజన్న, మల్లన్న, రాజకుమార్, ఎల్తూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.




# ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలి

## -ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ

*శాయంపేట, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త*



ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకొని నేటి యువతను ముందుకు సాగాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పిలుపునిచ్చారు. శాయంపేట మండల కేంద్రంలో తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏకలవ్యుడి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై ఏకలవ్యుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏకలవ్యుడి జీవితం ద్వారా ఏకాగ్రత, సమభక్తిని ప్రతి వ్యక్తి అమర్చుకోవాలన్నారు. ఆదిమ జాతి నాయకుడిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఎరుకలి కులస్తులు సంఘాలను ఏర్పాటు చేసుకోవాలని, సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామి ఇచ్చారు.

# పోలీస్ కానిస్టేబుల్ అరికల్ల శ్రీధర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

*శాయంపేట, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త*



శాయంపేట మండలం మైలారం గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ అరికిల్ల శ్రీధర్ గత ఏడాది క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు శ్రీధర్ మొదటి వర్ధంతికి అందరికి గుర్తుండేలా విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై పోలీస్ కానిస్టేబుల్ శ్రీధర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్న వయసులోనే శ్రీధర్ గుండెపోటుతో మరణించడం బాధాకరమని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల రూరల్ సిఐ పి.రంజిత్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి, మాజీ జడ్పిటిసి చల్లా చక్రపాణి, నిమ్మల రమేష్, చిందం రవి, మారపల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్‌బ్యాడ్మింటన్ 43వ జిల్లా స్థాయి సెలక్షన్స్

*ప్రభాతవార్త- సుబేదారి:*



వరంగల్ జిల్లాలో బాల్ బ్యాడ్మింటన్ 43వ జిల్లా స్థాయి సెలక్షన్స్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి బి.వీరన్న ఆధ్వర్య ంలో నిర్వహిం చారు. దీనిలో జిల్లా అసోసియేషన్ బాధ్యులు, జాయింట్ సెక్రటీలు, వైస్ ప్రెసిడెంట్లు, సీనియర్ క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను ప్రజలు పరిరక్షించుకోవాలి





### జాదవ్ పూర్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సౌరవ్ చౌదరి

**వెంకటాపూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలను ప్రజలు పరిరక్షించుకోవాలని జాదవ్ పూర్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల అసో సియేషన్ ప్రధాన కార్యదర్శి సౌరవ్ చౌదరి అన్నారు. వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవి పేట ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఇంచార్జీ ప్రధానో పాధ్యాయులు పెండ్యాల సలేంద్రం, జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఇంచార్జీ ప్రధానో పాధ్యాయులు సుధాకర్‌ల అధ్యక్షతన లక్ష్మీదేవిపేట ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు కారుపోతుల యాదగిరి ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థుల తల్లి దండ్రులు, గ్రామస్థుల అవగాహన సదస్సును నిర్వహించారు. గతంలో ఎంపీపీఎస్ లక్ష్మీదేవిపేట పాఠశాలలో టాయిలెట్స్ లేక పోవడంతో పత్రికా ముఖంగా ప్రధానో పాధ్యాయులు సూత్రాల రవి, సీనియర్ ఉపాధ్యాయులు పెండ్యాల సలేంద్రం లు కోరారు. దీనితో స్పందించిన ప్రియనేస్తం ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు పింగిలి నాగరాజు పాఠశాలకు వచ్చి వాస్తవ పరిస్థితులు పరిశీలించి వెంటనే జాదవ్‌పూర్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ కు తెలియజేశారు. దీనితో స్పందించిన జాదవ్‌పూర్ యూనిర్సిటీ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ వారు టాయిలెట్స్ నిర్మాణానికి ముందుకు వచ్చి రూ. 80 వేలు నిధులు ప్రియనేస్తం ట్రస్టుకు అందించారు. విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు కంటైనర్ రూపంలో పదిహేను రోజుల్లో టాయిలెట్స్ నిర్మించి విద్యార్థులకు సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా జాదవ్‌పూర్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జాదవ్ పూర్ యూనివర్సిటీ ప్రధాన కార్యదర్శి సౌరవ్ చౌదరి మాట్లాడుతూ నిరుపేద ప్రజల కోసం ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు నమోదు లేకుంటే వాటిని డిఫంక్ పాఠశాలలుగా గుర్తించి తొలగిస్తారని అన్నారు. నిరుపేద ప్రజలకు విద్యాబుద్ధులు నేర్పించి వారి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రతిరోజు సిఎం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనం, ఉచిత స్కూల్ యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందిస్తున్నా రని ఆయన తెలిపారు. విద్యార్థులకు విద్యను అందించి వారి అభ్యున్నతికి కృషి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని సౌరవ్ చౌదరి తెలిపారు. కాగా సమావేశం అనంతరం జాదవ్ పూర్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రియనేస్తం ట్రస్టు బోర్డు అధ్యక్షులు పింగిలి నాగరాజుల స్వయంగా విద్యార్థుల కోసం భోజనాలు వండించి విద్యార్థులకు వడ్డించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన పాఠశాలల పరిరక్షణ కమిటీ, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు జాదవ్ పూర్ యూనివర్సిటీ అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ అధ్యక్షులు కారుపోతుల యాదగిరి, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్‌లు పంజవేని స్వరూప, అజ్మీర కవిత, మాజీ సర్పంచ్ గట్టు కుమారస్వామి, కలం ఫౌండేషన్ అధ్యక్షులు సర్వర్ అహ్మద్, మేడారం ట్రస్టుబోర్డు డైరెక్టర్ తండ రమేష్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ తండ నగేష్, అంబేద్కర్ వాడి కొత్తపల్లి ఆనందం, పర్యావరణ వేత్త అలుగోజు శ్రీకాంతా చారి, ఉపాధ్యక్షులు గోందు సారంగపాణి, ఆర్గనైజర్ కట్టెకోళ్ల వెంకటేశ్, సంయుక్త కార్యదర్శి అంతటి రాము, కార్యదర్శి ఎంబటి సదయ్య, బైరి సంతోష్, కొండపర్తి రమేష్, యూత్ నాయకులు బండ నితిన్, బీరెల్లి రవితేజ, జాదవ్‌పూర్ యూనివర్సిటీ అసోసియేషన్ హైదరాబాద్ వైసన ప్రసిడెంట్ డిపో ఫామ్ చక్రవర్తి, సెక్రటరీ ఇంద్రనీల్ చౌదరి ట్రెజరర్ అభి మజుందార్, గ్రామస్థులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## లక్ష్మీదేవిపేట ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కమిటీ

### అధ్యక్షుడిగా కారుపోతుల యాదగిరి



**ములుగు, ఆగస్టు 7, ప్రభాతవార్త :** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట గ్రామంలో గ్రామ ప్రముఖులు శుక్రవారం సమావేశమై ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కమిటీగా ఏర్పాటు అయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో గ్రామస్థులు ఏకమై పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలనే సంకల్పంతో గ్రామానికి చెందిన ఉపాధ్యా యులు, గ్రామపెద్దలు శనివారం సమావేశామయ్యారు. పాఠశాల పరిరక్షణ కమిటీ అధ్యక్షునిగా కారుపోతుల యాదగిరి, ఉపాధ్యక్షులుగా కొండ తిరుపతి, రేపాల సత్యనారాయణ, గోందు సారంగం, సంయుక్త కార్య దర్శులుగా సాద శంకర్, బీరెల్లి తిరుపతి, అంతటి రాము, అలుగోజు శ్రీకాంత్, కోశాధికారిగా చిర్ర వీరస్వామి, ఆర్గనైజర్‌గా కట్టెకోళ్ల వెంకటేశ్, కార్యదర్శులుగా ఎంబటి సదయ్య, పత్రి దశరథం, బైరి సంతోష్‌లు సభ్యులుగా బీరెల్లి రవితేజ, బండ నితిన్, మోటం యాకయ్య, జిడ్డి కళ్యాణ్, ఇంచర్ల వంశీ, కన్వీనర్‌లుగా ఎండీ. సర్వర్ అహ్మద్, పెండ్యాల సలేంద్రం, కొత్తపల్లి ఆనందం, సలహాదారులుగా బండ్ల రాజయ్య, గట్టు కుమారస్వామి లు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం పాటుపడుతుందని, అందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా సిఎం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనం, స్కూల్ యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందజేస్తారని వారు తెలిపారు. మధ్యాహ్న భోజనంతో పాటు వారానికి మూడు రోజులు కోడి గ్రుడ్లు విద్యార్థులకు అందిస్తారని అన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకలు

### -రోగులకు పండ్లు, పాలు,బ్రెడ్స్ పంపిణి

### -యువతకు వాలీబాల్ కిట్‌పంపిణి

*గార్ల, సెప్టెంబర్8 ప్రభాతవార్త:*

ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో మండల కాంగ్రెస్‌పార్టి ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదినం సందర్బంగా ఆదివారం సొసైటి చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ ఆద్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మండల నాయకులతో కలిసి రోగులను సందర్శించి రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్‌ప్యాకెట్స్ పంపిణి చేశారు. అనంతరం మండల పరిధి కోట్యానాయక్ తండా గ్రామంలో యువకులకు వాలీబాల్ కిట్ వారిచేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతు ఆయురారోగ్యాలతో భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులను అలంకరించి ప్రజలకు మరింత సేవలను అందించి ప్రజాహృదయాల్లో నిలిచిపోవాలని కోరారు. ఈకార్యక్రమంలో పార్టి మండల అద్యక్షులు ధనియాకుల రామారావు, సొసైటి డైరెక్టర్ శీలంశెట్టి ప్రవీణ్‌కుమార్, సీనియర్ నాయకులు, మండలవర్కింగ్ ప్రసిడెంట్ మండా రాముగౌడ్, ఇల్లందు వ్యవసాయమార్కెట్



కమిటి మాజీచైర్మన్ భూక్య నాగేశ్వరావు, భూక్య రాంసింగ్, బాబులాల్, బాపనపల్లి సుందర్, కోలకుమార్‌గౌడ్, పల్లానర్సయ్య, పిల్లలమర్రి వీరస్వామి, నాయకులు మన్నేపల్లి వెంకయ్య, జాటోత్ సోభ్య, యూత్‌నాయకులు షేక్ యాకూబ్‌పాష, పల్లానర్సయ్య, బాణోత్ సురేష్, మోహిన్, మండాశ్రీను, కత్తుల ప్రశాంత్, ఫరీద్, కామునిరెడ్డి, మేడేపల్లి నాగరాజు, పురుషోత్తం, మొగిలి వెంకన్న, బాదం సురేందర్, గులగట్టు లెనిన్, బయ్యాసురేష్, పారాశ్రీశైలం, నాగార్జున, తదితరులున్నారు.

## ఖమ్మం వరద బాధితులకు ఆహారం ప్యాకెట్లు పంపిణి

*గార్ల, సెప్టెంబర్8 ప్రభాతవార్త:*

ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రాథమిక వ్యవసాయ సహకారపరపతి సంఘం చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ ఆద్వర్యంలో ఖమ్మంలోని వరద బాధితులకు ఆహారం(బిర్యానీ) ప్యాకెట్లు, వాటర్‌బాటిళ్ళు, పండ్లు పంపిణి చేయించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదినం సందర్బంగా ఇటివల కురిసిన భారివర్షాలకు వరదతాకిడికి గురై సర్వం కోల్పోయిన ఖమ్మం పట్టణంలోని పంపింగ్‌వెల్‌రోడ్, పెద్దమ్మతల్లి ఏరియా, బొక్కలగడ్డ, ప్రకాష్‌నగర్ ఏరియాలలో సుమారు 250 మందికిపైగా వరదబాధితులకు ఆయన సూచనల మేరకు ఆదివారం గార్లయూత్ నాయకులు పంపిణి చేశారు. ఆహారం ప్యాకెట్లు అందజేయడం పట్ల వరదబాధితులు మానవత్వం చాటుకున్న దాత వడ్లమూడి దుర్గాప్రసాద్‌కు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో యూత్‌జిల్లా నాయకులు షేక్ యాకూబ్‌పాష, నియోజకవర్గ నాయకులు భూక్య బాబులాల్, యూత్‌మండల నాయకులు పారాశ్రీశైలం, పసుపులేటి నాగార్జున, పిల్లలమర్రి వీరస్వామి, పాష, అందాల రాజీవ్, రాము, రిత్విక్, రమేష్, నవీన్, కృష్ణ, నరేందర్, తదితరులున్నారు.



## వృద్దురాలి అదృశ్యంపై కేసు నమోదు

*గార్ల, సెప్టెంబర్7 ప్రభాతవార్త:*

వృద్దురాలి అదృశ్యంపై కేసు నమోదు చేసిన సంఘటన శనివారం మండలంలో జరిగింది. ఎస్సై ఎన్. జీనత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధి పినిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన 85సంవత్సరాలు వయస్సున్న వృద్దురాలు గోడిశాల యాకమ్మ అదృశ్యం అయినట్లు, గత 20రోజుల క్రితం నుండి మతిస్థిమితం కోల్పోయి ఇంటి నుండి వెళ్ళి పోయినట్లు తెలిపారు. బంధువులు, తెలిసినవారికి సమాచారం అందించి ఎక్కడ వెతికినా జాడలేదని ఫిర్యాదు పెర్కోంటు తన కుమారుడు మేకపోతుల రాజు పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పెర్కోన్నారు.

## పూర్వ విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సహాయం

**ప్రభాతవార్త, ఎల్కతుర్తి:**మండలంలో ఇటీవల కొతులనడుమ గ్రామంలో గుండెపోటుతో మృతి చెంది కోహెడ గురుకుల పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి ఎర్రోళ్ల చంటి కుటుంబానికి పాఠశాల పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే ఎల్కతుర్తి మండలం కోతులనడుమ గ్రామానికి చెందిన ఎర్రల చంటి గత కొద్ది రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తనతోపాటు చదువుకున్న కోహెడ గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు వారి కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. వారు ఆర్థిక సహాయం కింద రూ.50వేల ఆర్థిక సాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా అతనితో చదువుకున్న పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. చిన్న వయసులో మిత్రుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. 2005-06 సంవత్సరం 10వ తరగతి వరకు హాస్టల్‌లో చదివిన అందరితో కలుపుగోలుగా ఉండేవాడని గుర్తు చేసుకున్నారు. చంటి కుటుంబానికి అన్ని విధలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదే కోహెడ గురుకుల పాఠశాలలో చదువుకున్న విద్యార్థుల కోహెడ గురుకుల సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామని, ఎవరికి ఏ ఆపద వచ్చిన సంక్షేమ నిధి నుండి ఆర్థిక సహాయం అందిస్తూ వారి కుటుంబాలకు భరోసా ఉంటామని వారు అన్నారు.. ఆర్థిక సహాయం అందించిన వారిలో కోహెడ హాస్టల్ పూర్వ విద్యార్థుల బృందం వారిలో జేరిపోతుల జనార్ధన్, మేడి శ్రీనివాస్, ఆరేపల్లి కిరణ్, లంకదాసరి కళ్యాణ్, పెద్దెల్లి మహిపాల్, కౌటం శేఖర్, ఆరే శరత్, కనగండ్ల అజయ్, జక్కనపల్లి రాజులతో పాటు గ్రామస్తులు ఎర్రోళ్ల చైతన్య బాబు తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసాకై రైతన్నల ఎదురుచూపులు

### పెట్టుబడి కోసం అన్నదాతల అప్పులు

### రైతు భరోసా ప్రభుత్వం దృష్టి సారించి ఆదుకోవాలని రైతన్నల వినతి

**ఏటూర్‌నాగారం, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త:** రైతు భరోసా పెట్టుబడి సాయం ప్రభుత్వం ఎప్పుడు అందిస్తుందోదని రైతన్నలు ఎదురు చూస్తున్నారు. పంట సాగు మొదలై 3 నెలలు గడస్తున్నా ప్రభుత్వం రైతు భరోసా అందింకపోవడంతో చిన్న , సన్న కారు రైతులు పెట్టుబడి కోసం ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించి అధిక వడ్డీలకు అప్పులు చేయక తప్పడం లేదని, పలువురు రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. పంట రుణమాఫీ చేసిన ప్రభుత్వం రైతు భరోసాపై దృష్టి సారించి పంట సాయం అందించాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత ్వం ఏర్పడిన తరువాత రైతు బంధు పథకం కింద రూ.5 వేలు పెట్టుబడి సాయం అందించిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఇచ్చిన విధంగా ఎకరాకు రూ. 15 వేలు ఒకొక్క పంట సీజన్‌లో రూ. 7.500 చొప్పున అందిస్తామని హామీ ఇచ్చారని, ఇట్టి హామీని అమలు పరిస్తే రైతులకు లబ్ది చేకూరుతుందని వారు కోరుతున్నారు. గత ప్రభుత్వం ఎకరాకు రూ. 10 వేలు ఒకొక్క పంట సీజన్‌లో పంట సాయం కింద రూ.5 వేలు అందించారని, టీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రైతు బంధు





నిధులు దుర్వినియోగం అయ్యాయనే విమర్శలతో ఇటీవలే ప్రభుత్వం రైతు సమావేశాలు నిర్వహించి రైతుల నుండి అభిప్రాయ సేకరణ చేయడం జరిగినా ఈ విషయంలో ప్రభుత్వం ఇంకా ఒక నిర్ణయం తీసుకోకపోవడంతో రైతుబంధు ఆలశ్యం అవడంతో రైతన్నలు ఎదురు చూడక తప్పడంలేదు. రైతు భరోసా పంట సాయం చిన్న, సన్న కారు రైతులకు ఎంతో భరోసానిస్తుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ప్రభుత్వం రైతు భరోసా పై విధాన పరమైన నిర్ణయాలు తీసుకొని పంట సాయం అందించాలని పలువురు అన్నదాతలు కోరుతున్నారు.

# ప్రయాణికులకు సేవలందించడమే ప్రయాణికుల లక్ష్యం....!





### ప్రయాణికుల కోసం పోలీసులు సైతం హైవేపై పనులు

### జలగలంచ వద్ద ప్రమాద సూచిక బోర్డులు

### భారీ వర్షాలక వంతెన వద్ద ప్రమాదకరంగా గుంతలు

### పస్ర, తాడ్వాయి పోలీసులు కష్ట సాధ్యమైన పనులు

**మేడారం, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త:** ప్రయాణికులు సురక్షితంగా ప్రయాణించా లని పోలీసు అధికారులు సేవలందించడం జిల్లాలోనే సంచలనం కలిగిస్తుంది. 15రోజులుగా కుండ పోతగా కురుస్తున్న వర్షాలకు తాడ్వాయి సమీపంలోని మొండ్యాలతోగు, జలగలంచవాగు వద్ద రోడ్డుపై పెద్ద పెద్ద కందకాలు ఏర్పడ్డాయి . కార్లు, బస్సులు, మోటార్ సైకిళ్లు వెళితే కందకాల్లో పడి ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. హైవే రోడ్డుపై నిత్యం గంటకు వేలాది వాహనాలు వెళ్తుంటాయి. ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు గాను తాడ్వాయి, పస్ర పోలీసులు ఈ కందకాలను గమనించి రెండు రోజులుగా వినూత్నమైన పనులు చేపట్టారు. ప్రయాణికుల కోసం పోలీసులు సైతం అనే విధంగా ఈ పనులున్నాయి. అంతే కాకుండా జలగలంచ వద్ద ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. భారీ వర్షాలకు వంతెన వద్ద ప్రమాదకరంగా గుంతలు ఏర్పడటంతో పోలీసు అధికారులే ఆశ్చర్య పోయారు. ఉదయం నుండి వర్షం కురుస్తున్నప్పటికీ పస్ర సీఐ రవీంధర్, తాడ్వాయి ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది అంతా వర్షంలో తడుస్తూ పనులు చేయడం రోడ్డు వెంట వెళ్లే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై పడిన చెట్లను తొలగించడమే కాకుండా ప్రయాణికులు సురక్షితంగా ( పయాణించే విధంగా సేవలదింస్తున్నారు. ఇదిలా ఉండగా జలగలంచ వద్ద చేపట్టిన పనులు ప్రమదాలు బాగా చోటు చేసుకునే విధంగా ఉన్నాయి. వాటి వివరణ కోసం పోలీసు అధికారులు ఆ పనులు కష్టమైనప్పటికీ ప్రయాణికుల కోసం సేవలందించడం జిల్లా వ్యాప్తంగా చార్చనీయాంశమైంది. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఆర్మి రమేష్, జాజ సాంబయ్య, వెంకన్న, చింత నారాయణ, పూజారి రమేష్, రామన్న తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో కొలువుదీరిన గణనాథులు

### వాడవాడనా ధూప దీపనైవేద్యాలు అందుకుంటున్న గణనాథులు

### భక్తులు భక్తి శ్రద్దలతో ప్రత్యేక పూజలు

**గోవిందరావుపేట, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త :** గణపతి నవరాత్రోత్స వాల్లో భాగంగా గోవిందరావుపేట మండలంలోని శనివారం నాడు 18 గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాలలో (60) గణనాథులు కొలువు తీరి ఉన్నారు. కొలువైన విఘ్నేశ్వరుడికి గణనాథులకు ఆదివారం రెండో రోజు భక్తులు విశేష పూజలందించారు. భక్తులు ఏకదంతుడికి ఆదివారం ఉదయం విగ్రహాల వద్ద పూజలు నిర్వహిస్తూ భక్తిని చాటుకుంటున్నారు. సాయంత్రం పూజలు చేయడంతో పాటు రాత్రి వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే మండలంలోని 18 గ్రామపంచాయతీలలో పరిధిలో ఉన్న గ్రామాలు, శివారు పల్లెలు, తండాల్లో వినాయకచవితి సందర్భంగా గణనాథులు కొలువుదీరారు. మండల వ్యాప్తంగా శనివారం గణపతి నవరాత్రి ఉత్స వాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం పసర, రాంపూర్, గోవిందరావుపేట చల్వాయి, గాంధీనగర్, ముద్దులగూడెం, మచ్చా పురం, బుసాపురం, దుంపెల్లి గూడెం, కర్లపల్లి, లక్ష్మీ పురం, గ్రామాలలో యువజన సంఘాల ఆధ్వర్యంలో వినాయక మండపంలో ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను ప్రతిష్టాపించారు.

**గణపతి మండపానికి విరాళం :**పసర నగరంలో ఒకటో వార్డులో గణపతి ఉత్స వ కమిటి ఆధ్వర్యంలో 1996 సంవత్స రం నుంచి గణపతి ఉత్స వాలను నిర్వహిస్తున్నామని, గణపతి గౌరవాధ్యక్షులు తక్కలపల్లి దేవేందర్రావు తెలిపారు. గణపతి ఉత్స వ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన గణేష్ మండపానికి, త్రిపురనేని చంద్రశేఖర్ - సుస్మిత మామునూరు సర్కిల్ ఇన్స్ పెక్టర్ (ఏఆర్) 30 వేల రూపాయలను వారి తండ్రి అయిన వెంకటేశ్వర ద్వారా ఉత్స వ కమిటీకి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ సుస్మిత దంపతులను పసర గ్రామ ప్రజలు అభినందించారు. యూత్ కమిటీ సభ్యులు బజార్ క్రాంతి, గంగెల్లి భరత్, పత్రి మధు, పత్రి పూర్ణ, చెర్ల మహేష్, గంగిలి భారత్, ఎర్రబెల్లి రాజు, నాగలి రాజు భరత్, కడారి అనిల్, కొప్పుర రాజశేఖర్, బండి మణికంఠ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. చల్వాయి గ్రామంలో, గోవిందరావుపేట, మండలం కేంద్రంలోని అప్పయ్య స్వామి ఆలయంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పిఎంకె గాంధీ పూజా కార్యక్రమాలు నిర్వహించి, గణనాధుని ప్రణమిలారు. రకరకాల నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జైజై గణేశా జయము నువ్వ బొజ్జ గణపయ్య ఉండ్రాలయ్య దండాలయ్య అంటూ నామస్మరణాలు చేస్తూ హోరె త్తించారు. విద్యుత్ దీపాలు, షామియానాలతో దేదీప్య మానంగా వెలిగి పోతున్నాయి. చిన్నాపెద్ద తేదా లేకుండా యువతి యువకులు పిల్లలతో మండపాల వద్ద సందడి నెలకొంది. ఉదయమే పుణ్యస్థానాలు నిర్వహించు కొని వినాయకుల విగ్రహాలను పూజించి పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. వినాయక వ్రత నియమాలను పాటిస్తూ వ్రత కథ చదివారు. మండలంలో ఉన్న గ్రామాలలో గణేష్ నవరాత్రి ఉత్స వాలు అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. తొమ్మిది రోజుల పాటు భక్తులు కొలవనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ కమలాకర్ గణపతి ఉత్స వాల కమిటీ సభ్యులకు సూచనలు జారీ చేసినారు.



## ఏటూర్‌నాగారం వార్త

## బందాల,పోచాపురం

# గ్రామాల రోడ్లపై నిర్లక్ష్యం ఎందుకో.... ?

### గుట్టలు ఎక్కివాగులు దాటితేనే రోడ్డుకు చేరేది

### దట్టమైన అడవుల్లో కాలినడకన రావడమే

### కంటైనర్ ఆస్పత్రి ఓపినింగ్ రోజున రోడ్లను కలెక్టర్ చూశారు

### ఇలా చూసి రోడ్డు సమస్యను అలా వదిలేసెను



**మేడారం, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త:** దట్టమైన అడవుల్లో ఉన్నటువంటి బంధాల, పోచాపురం గ్రామాలకు వెళ్లే రోడ్లపై నిర్లక్ష్యం ఎందుకో అని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. గట్టలు ఎక్కి వాగులు దాటితేనే రోడ్డుకు చేరు కుంటున్నా మని బంధాల మాజీ సర్పంచ్ ఊకె మోహన్‌రావు, మాజీ వైస్ ఎంపిపి ఆయం నర్సింగరావు, పోచాపురం గ్రామస్తులు విలేకరులతో మాట్లాడుతూ దట్టమైన అడవుల్లో ఉంటున్నామని, నిత్యవసర సరుకుల కోసం కానీ,విద్యార్థులు కళాశాలకు వెళ్లాలన్నా బంధాల నుండి పోచాపురానికి వస్తే అక్కడి నుండి గుట్ట దిగి దట్టమైన అడవిలో వాగులు దాటి కంకర తేలిన రోడ్డుపై కాలినడకన ప్రధాన రోడ్డుకు చేరుకుంటాము. ఈ సమస్యను పోచాపురంలో ఇటీవల కంటైనర్ ఆస్పత్రి ఓపెనింగ్ చేశారు. ఆ రోజున జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్‌కు రోడ్డు సమస్యను వివరించాము. ఇలా చూసి రోడ్డు సమస్యను అలా వదిలివేశారని ఆవేధన వ్యక్తం చేశారు. వర్షాకాలం పోయే వరకు మాకు ఇబ్బందులు తప్పే విధంగా లేవని ఆవేధన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకొని రోడ్లు మరమ్మతు పనులు చే పట్టాలని కోరుతున్నారు.

# గుత్తికోయల గూడెంలో ఏఎస్పీ

### నిత్యవసర సరుకుల పంపిణీ

### ఎటువంటి ఆపద వచ్చినా పోలీసులకు చెప్పండి



**మంగపేట సెప్టెంబర్8,ప్రభాతవార్త** మంగపేట మండలంలోని ముసలమ్మ గుట్ట గుత్తికోయల గూడెంను ఏటూర్‌నాగారం ఏఎస్పీశివం ఉపాధ్యాయ తన బృంధంతో వెళ్ళి వారి బాగోగులు తెలుసుకుని రాబిన్ హుడ్ ఆర్మీ సహాయంతో నిత్యవసర సరుకులను ఆదివారం గుత్తికోయలకు అందించారు.ఈసందర్భంగా ఏఎస్పీ శివం ఉపాధ్యాయ మాట్లాడుతూ ఇతరులతో కలిసి మెలసి మెలగాలని సమాజానికి దూరంగా ఉండ వద్దని, సంఘం విద్రోహులకు ఆశ్రయం కల్పించ వద్దని అటువంటి వారితో ఎటువంటి ఉపయోగం కూడా లేదని, అటువంటి వారి వల్ల మీపై మీపిల్లపై చెడు ప్రభావం ఏర్పడుతుందని, మీప్రాంతాల్లో అభివృద్ధి కుంటు పడుతుందని, మీగూడేల్లోకి ఎవరు కొత్తవారు వచ్చినా మీశ్రేయస్సు కోరే పోలీసులకు వెంటనే సమాచారాన్ని అందించాలని ఆయన సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వార్షాల వల్ల ఇబ్బందులు ఉంటాయని అవసరం ఉంటేనే బయటకు రావాలని రాత్రి వేళల్లో వెలుతురు ఉండేలా చూసుకోవాలని ఆయన కోరారు. ఎటువంటి ఆపద వచ్చినా మీకు సహాయం చేయడానికి పోలీసులు ముందుంటారని వారిని సంప్రదించాలని ఆయన కోరారు. ముసలమ్మ గుట్టగూడెంలో త్రాగునీరు సమస్య ఎక్కువగా ఉందని తమకు త్రాగునీటి సమస్య తీర్చాలని ఏఎస్పీని కోరగా వెంటనే ఆయన స్పందించారు భోరుసహాయం ద్వారా త్రాగునీరు అందిస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఏటూర్‌నాగారం సీఐ శ్రీనివాస్. మంగపేట ఎస్ఐ టీవీఆర్ సూరి తదితరులు పాల్గొన్నారు



# శాస్త్రీయ సమాజ నిర్మాణంలో జెవివి కృషి అభినందనీయం

**-జన విజ్ఞాన వేధిక**

**ఐదవ మహాసభలో**

**-జిల్లా అధనపు కలెక్టర్ డేవిడ్**



*మహబూబాబాద్, సెప్టెంబర్8, ప్రభాతవార్త:* శాస్త్రీయ సమాజ నిర్మాణంలో జనవిజ్ఞాన వేధిక కృషి అభినందనీయమని మహబూబాబాద్ జిల్లా అధనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. ఆదివారం స్థానిక ఐఎంఏ హాలులో తడకమల్ల బ్రహ్మం అధ్యక్షతన నిర్వహించిన జెవివి ఐదవ మహాసభలో వారు పాల్గొని మాట్లాడుతూ సమాజంలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రజలకు చేరవేయుటలో, ప్రజల్లో ఉన్న అశాస్త్రీయ భావజలాలను తొలగించడంతో జెవివి కృషి అమోఘం అన్నారు. అనంతరం జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంపల్లి దయానంద్ ఈ రెండు సంవత్సరాలకు గాను జన విజ్ఞానవేధిక ద్వారా చేసిన కార్యక్రమాలను నివేదికల ద్వారా వివరించారు. ఈ మేరకు పూర్వ నీట్ ప్రొఫెసర్ కొత్త లక్ష్మారెడ్డిని శాలువా, మెమోంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు అలువాల నాగేశ్వర్‌రావు, గౌరవ అధ్యక్షులు బానోత్ నెహ్రూరాథోడ్, డాక్టర్ బి.అనిల్‌గుప్తా, బి.వెంకట్రాములు, ఎస్.భీంసాగర్, ఉమాదేవి, మైస నాగయ్య, ఏకాంతంగౌడ్, మంగపతిరావు, కృష్ణప్రసాద్, యాకయ్య, సాహితి శ్రీనివాస్, స్వప్న, శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, సురేష్, సునిత, సాధ్విమని, బాలాజీ, విజయరాజ్, నవీన్, రవి, నేందర్, మోహనకృష్ణ, చక్రధర్, లక్ష్మినారాయణ, కవిత, దర్గయ్య, యాకన్న, ప్రవీణ్, రాంనర్సయ్య, ఉపేందర్, సుందర్, శ్రీధర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం భోజనం అందించాలి

**-ప్రిన్సిపల్ గైర్హాజరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన**

**-ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రామచంద్రునాయక్**

*మరిపెడ, సెప్టెంబర్8, ప్రభాతవార్త:*



విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోతు రామచంద్రునాయక్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటి కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావుపూలే బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లల హాజరుశాతాన్ని, ఉపాధ్యాయుల రిజిస్టర్‌ను క్షున్నంగా పరిశీలించారు. పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. వసతిగృహంలో సౌకర్యాలను విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా ఆంగ్లమాద్యమం విద్యతో పాటు ఏకరూప దుస్తులు, నాణ్యమైన భోజనం అందిస్తుందన్నారు. పిల్లల కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ పిల్లలకు క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు క్రీడలు నేర్పించి పిల్లలు ఎదిగేందుకు కృషిచేయాలన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలకు దుమ్మా కోడితే సహించేది లేదన్నారు. వర్షాలు విపరీతంగా కురుస్తున్నందున వర్షాలు తగ్గాక మరోసారి పాఠశాలను సందర్శిస్తానని అన్నారు. వారి వెంట అద్యాపక బృందం ఉన్నారు.

## నేటి ప్రజావాణి రద్దు

*మహబూబాబాద్, సెప్టెంబర్8, ప్రభాతవార్త*

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నేటి ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో పెర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అధికారులందరిని మండలాల ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగిందని మరో రెండు, మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజల సౌకర్యార్థం ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

## కన్నతండ్రికి, నానమ్మకు తలకొరివి పెట్టిన మనవడు

*కురవి, సెప్టెంబర్8, ప్రభాతవార్త*



ఇటీవల తన తండ్రి మరణించగా తలకొరివి పెట్టి మరవకముందే తన నానమ్మ మృతిచెందడంతో ఆమెకు కూడా మనవడు తరుణ్ తలకొరివి పెట్టిన విషాద సంఘటన ఆదివారం కురవిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితె కురవి గ్రామానికి చెందిన భద్రయ్య ఇటీవల మరణించగా తన తల్లి మల్లమ్మ మంచాన పడింది. అనారోగ్యంతో ఆదివారం మరణించగా ఆమె మనువడు బాలుడు తరుణ్ ఆమెకు తలకొరివి పెట్టడంతో ఆ కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఈ సంఘటన చూసిన గ్రామస్థులు శోకసముద్రంలో మునిగారు.

## సిపియం అనుబంధ ఐద్వ పట్టణ అధ్యక్షురాలు మృతి

*మహబూబాబాద్, సెప్టెంబర్8, ప్రభాతవార్త:*



సిపియం పార్టీ మున్సిపల్ ఫ్లొర్ లీడర్ సూర్నపు సోమయ్య సతీమణి, ఐద్వ పట్టణ అధ్యక్షురాలు సూర్నపు సావిత్రమ్మ ఆదివారం మృతిచెందింది. వివరాల్లోకి వెళితే ఇటీవల సమీప బందువు ప్రమాదవశాత్తు మరణిస్తే అతని అంత్యక్రియల్లో పాల్గొన్న ఆమె కుప్పకూలిపోవడంతో హుటాహుటిన హైద్రాబాద్‌కు తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. కాగా ఆదివారం ఆమె పరిస్థితి విషమించడంతో ఆదివారం ఉదయం మరణించింది. ఆమె పార్టీలో చురుకుగా పాల్గొంటూ అంకితభావంతో పనిచేసేదని ఆమె లేని లోటు తీర్చలేనిదని పలువురు కంటతడి పెట్టారు. నిత్యం ప్రజల సమస్యలకై పోరాడుతూ ఉండేదని పలువురు అభిప్రాయ పడ్డారు. కాగా విషయం తెలుసుకున్న అనేక మంది ప్రముఖులు ఆమె భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సూర్నపు సోమయ్యను ఓదార్చి ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో సిపియం కేంద్రకమిటీ సభ్యుడు జి.నాగయ్య, జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, బండి పుల్లయ్య, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, ఆకుల రాజు, అలువాల వీరయ్య, కౌన్సిలర్ పద్మాసీతారాంనాయక్, వివిధ పార్టీల ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ఆదివారం రోజున విదుల్లో సిబ్బంది

*మహబూబాబాద్, సెప్టెంబర్8, ప్రభాతవార్త*



జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న గృహ, ఆస్తి, ప్రాణ, పంట తదితర వివరాలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంటింటి సర్వే నిర్వహించగా ఆదివారం సెలవుదినం రోజున రెవెన్యూ సిబ్బంది విదులు నిర్వహిస్తూ అట్టి వివరాలను నమోదు చేశారు. మండలాల ప్రత్యేక అధికారులు గ్రామాల వారిగా వరద బాధితులకు నిత్యవసర వస్తువలు పంపిణీ, వైద్యం, శానిటేషన్, త్రాగునీరు, విద్యుత్ తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. జిల్లా కలెక్టర్ నిత్యం పర్యవేక్షిస్తూ అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు పనిచేయాలని కలెక్టర్ అన్నారు.

## మరిపెడకు వచ్చిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

*మరిపెడ, సెప్టెంబర్8, ప్రభాతవార్త*



మున్సిపాలిటి కేంద్రంలో ఆదివారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ల్యాండ్ అయింది. ఖమ్మం జిల్లా వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను పరామర్శించడానికి వెళుతున్న క్రమంలో హెలికాప్టర్ ల్యాండ్ అయినట్టు అధికారులు తెలిపారు. వారి వెంట జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పి సుధీర్‌రాంనాథ్‌కేకన్, మంత్రులు కోండా విశ్వేశ్వర్, ఈటెల రాజేందర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు యుగంధర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, రఘువీరారెడ్డి, రాంలాల్, అశోక్, అంబరీష, తాజుద్దిన్, అప్జల్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ వార్త

మహబూబాబాద్, మరిపెడ, కురవి, గార్ల

## కురవి-మోగిలిచెర్ల రహదారి బంద్

**-తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు**

*కురవి, సెప్టెంబర్8, ప్రభాతవార్త:*



ఇటీవల కురిసిన వర్షాలకు కురవి నుండి మోగిలిచెర్ల వెళ్లె రోడ్డు ధ్వంసం కావడంతో రైతులు తమ పొలాల వద్దకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు గత మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు ముత్యాలమ్మకుంట చెరువుకట్ట తెగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సత్వరమే సంబందిత అధికారులు స్పందించి చెరువు కట్ట మరామత్తు పనులు చేపట్టి, ధ్వంసమైన రోడ్డుకు మరామత్తులు చేయాలని పలువురు కోరుతున్నారు.

## వార్త కథనానికి స్పందన

*మహబూబాబాద్, సెప్టెంబర్8, ప్రభాతవార్త*



ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డుపైకి చెట్టు ఒరిగి పోవడంతో వారం రోజులుగా ప్రయాణికుల ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వార్త దినపత్రికలో వచ్చిన మా బాధ ఎవరికి చెప్పాలి అనే కథనానికి సంబందిత అధికారులు స్పందించారు. శనివారం ఉదయం రోడ్డుపై ఒరిగిన చెట్టు కొమ్మలను మున్సిపాలిటి వారు తొలగించారు. దీంతో ప్రయాణికులు, ఎల్ఐసి ఉద్యోగులు మున్సిపల్ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా వార్త దినపత్రికలో ప్రచురించి సమస్యను పరిష్కరించే విధంగా కృషిచేసిన వార్త విలేఖరిని అభినందించారు.

## సూర్నపు సోమయ్యను పరామర్శించిన ఎమ్మెల్యే

*మహబూబాబాద్, సెప్టెంబర్8, ప్రభాతవార్త*



సిపిఐ మున్సిపల్ ఫ్లొర్ లీడర్ సూర్నపు సోమయ్య సతీమణి సావిత్ర ఆదివారం హైద్రాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మురళినాయక్ దంపతులు, డిసిసి అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డిలు హైద్రాబాద్‌లోని ఆసుపత్రికి వెళ్లి సావిత్ర మృతదేహానికి నివాళులు అర్పించి సూర్నపు సోమయ్యను ఓదార్చారు. వారి వెంట నాయకులు ఉన్నారు.

## అంగరంగ వైభవంగా కొలువుదీరిన గణనాధుడు

*మరిపెడ, సెప్టెంబర్8, ప్రభాతవార్త:*

మున్సిపాలిటి కేంద్రంలో శనివారం ఆర్ఎస్ ప్లాజా గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణనాధున్ని ప్రతిష్టించారు. రేసు సునిత-సత్తిరెడ్డి దంపతులు విగ్రహాన్ని ఇప్పించారు. భాజా బజంత్రిలు, బాణసంచా పేలుస్తూ నృత్యాలు చేస్తూ మండపం వద్ద గణనాడుధుడు కొలువుదీరాడు. చిన్నా, పెద్ద తేడా లేకుండా టెంకాయలు కొట్టి పూజల్లో పాల్గొన్నారు. ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండి పాడిపంటలు సంమృద్ధిగా పండి అష్ట ఐశ్వర్యాలు కలగాలని భగవంతున్ని వేడుకున్నారు. ఆర్ఎస్ ప్లాజా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# నవరాత్రుల పూజలకు మండపాల్లో కొలువుదీరిన సిద్ది వినాయకుడు







**సంగెం, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

సృష్టికి మూలమైన శక్తి స్వరూపిణి అయితే ప్రతి సృష్టికి మూలమైన, విష్ణు, బహ్మ, ఈశ్వరులైనారు శివపార్వతులైన తనయుడైన విఘ్నేశ్వరుడు బద్రపద శుద్ధ చవితి నాడు జననం పొందాడు. విఘ్నేశ్వరుడు ముందుగా సకల దేవతలకు అరాధ్యదైవం గావించబడుతాడని హితిహాసాల ద్వారా తెలుస్తోంది. త్రేత యుగంలో శ్రీరాముడు, ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు విఘ్నేశ్వరున్ని కొలిచినట్లు దైవ పురాణాల ద్వారా తెలుస్తోంది. నాటి దేవతల కాలం నుండి నేటి కలియుగంలోని మానవాళికి కూడా అనేక రూపాల్లో పిలిచే వర సిద్ధి వినాయకుడు ముందుగా కలియుగంలో మానవుడు ఏ పని చేపట్టాలన్నా ఏ ముహూర్తం చేయాలన్నా ఏ దైవాన్ని కొలువాలన్నా ముందుగా గణపతి పూజ చేసిన తర్వాతనే ఆయా ఇష్ట దేవతలను కొలుచుకుంటాము. ఇలాంటి ఓంకార స్వరూపుడైన గణనాథుడు యావత్ భారత మానవాళి భక్తులు ప్రతీ సంవత్సరం ప్రత్యేకంగా బద్రపద శుద్ధ చవితి రోజు నుండి మొదలుకొని 9 రోజులు నవరాత్రుల పూజలు జరుపుకోవడం ఈ కలియుగంలోని భారతదేశంలో ఒక హిందువులకు మాత్రమే గణేషుని పండుగను జరుపుకోవడం సాక్షత్తు దైవ సంకల్ప సృష్టికి మూలమైన శక్తి స్వరూపిణి యొక్క సంకల్పమని చెప్పవచ్చు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన గణేషుడి నవరాత్రి ఉత్సవాలు లోక కళ్యాణం కోసం భక్తి శ్రద్దలతో జరుపుకోవడం భారతదేశంలో ఒక ప్రత్యేకమైనటువంటి పున్యకార్యక్రమమని అభివర్ణించవచ్చు. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం కూడా బద్రపద మాసంలో చవితి ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా హిందూ భక్తులు జరుపుకుంటున్నారు. ఇంతింతై వటుడింతై అన్నట్లుగా ప్రతి యేటా గణేష్ ఉత్సవాలు పెరుగుతూ మారుమూల గ్రామాల్లో సైతం కాశ్మీర్ నుంచి మొదలుకొని కన్యాకుమారి వరకు వినాయకుడి ఉత్సవాలు జరుపుకోవడం భగవంతుడి సంకల్పంతో ముక్తి చెందడం కోసం మానవాళికి భక్తి మార్గం వైపుగా భక్తులు 9 రాత్రులు పూజలు పుణ్యకార్యక్రమంగా సబ్బండ భక్తజనం రసాయనాలతో తయారైన విగ్రహాలను వాడటం శోచనీయం ఇలాంటి విగ్రహాలు వాడకుండా ఇట్టి విగ్రహాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంబంధిత స్వచ్చంద సంస్థలు దేవాదాయ శాఖ వారు మట్టి విగ్రహాలనే వాడాలని ప్రసార మాధ్యమాలలో విస్తృతంగా ప్రచారం చేస్తూ అదేవిధంగా స్వచ్చంద సంస్థలు విగ్రహాలను తయారు చేసి ఉచితంగా ఇస్తున్నారు. అయినా కూడా నేటికి ఇంకా ఇలాంటి రసాయనాలతో కూడిన విగ్రహాలను వాడుతుండటంతో పర్యావరణానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇలాంటి విగ్రహాలను ప్రభుత్వాలు నిషేదించాలని భక్తులు కోరుకుంటున్నారు. రసాయనాలతో కూడిన విగ్రహాలను వాడకుండా కేవలం మట్టితో తయారు చేసిన విగ్రహాలను వాడితే మహోన్నతమైన పుణ్యం కలుగుతుందని వేద పండితులు జరుగుతుంది. ఇతిహాసంలో చెప్పబడినట్లుగా గజాసురుని కోరికను తీర్చుటకు శివుడు కైలాసం విడిచి వెళ్లినప్పుడు పార్వతి దేవి అభ్యంగన స్నానం ఆచరించుట కోసం లోనికి వెళ్లే ముందు నాలుగు పిండితో చేసిన బొమ్మకు జీవం పోసం ఇంటిలోకి ఎవరు రాకుండా కాపలా ఉంచిన ఆ బాలుడే ఈ వినాయకుడు. అలాంటప్పుడు భక్తులు మట్టితో చేసిన గణేషుని ప్రతిమలను మాత్రమే మండపాల్లో కొలువు తీర్చి పూజలు నిర్వహిస్తే వెయ్యి సదముల పుణ్యం కలుగుతుందని భగవత్ పురాణాల్లో చెప్పబడింది. ఇదిలా ఉంటే ఈ సారి వరంగల్ జిల్లాలో మట్టి విగ్రహాల సంఖ్య పెరిగినట్లు ఆయా వినాయక ఉత్సవ కమిటీలు తెలుపుతున్నాయి. గ్రామాల్లో కూడా మట్టి విగ్రహాలు పెడుతున్నారు. వీటిపైనే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ఈ సారి సంగెం మండల కేంద్రంతో పాటు ప్రతి గ్రామంలోని వినాయక నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవడం కోసం ఆయా మండపాల్లో విగ్రహాలను కొలువు తీర్చారారు. ఉదయం మొదలుకొని రాత్రి 8గంటల వరకు మండపాల్లో ఆయా దేవాలయ ప్రధాన అర్చకులచే పూజలు నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. మండపాలను చూపరులకు భక్తి భావం కలిగేవిధంగా దైవ సన్నిధిలో ఉండి వివిధ రకాల డెకరేషన్లతో అలంకరించి పూజల నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే కొన్ని గ్రామాల్లో మండపాల వద్ద డిజేలు పెట్టి వివిధ రకాల జానపద, సినిమా పాటల పోలికలతో వకృత పద చరణాలతో పాడిన పాటలను డీజే సౌండ్లతో వినిపిస్తూ భక్తి మార్గాన్ని వక్రీకరించే విధంగా ఉంటున్నాయి ప్రజలు విస్తు చెందుతున్నారు. ఇలాంటి పాటలు కాకుండా కేవలం విఘ్నేశ్వర స్తోత్రములు మాత్రమే వినిపిస్తే భగవంతుని ద్వారా భక్తులకు ముక్తి లభిస్తుందని భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. భక్తులు, నియమ నిబద్దలతో, భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహిస్తే భక్తునిలో భక్తి స్వారూప్యం పెరిగి శాంతిస్వరూపునిగా సన్మార్గంలో ఆ భగవంతుడే నడిపిస్తాడని ఆశిద్దాం.

## గణపయ్య పూజలో నన్నపునేని నరేందర్-వాణి దంపతులు

**పోచమ్మ మైదాన్ కార్పొరేషన్, ప్రభాతవార్త**

వినాయక చవితి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వరంగల్ తొలి మేయర్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ క్యాంపు కార్యాలయంలో నరేందర్, వాణి దంపతులు గణపతిని ప్రతిష్టించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణనాధుని ఆశీస్సులతో వరంగల్ తూర్పు ప్రజలందరూ సుఖ శాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రజలందరికీ మంచి జరగాలని ఆ స్వామి వారిని వేడుకున్నానని నరేందర్ పేర్కొన్నారు. అనంతరం కరీమాబాద్ కాశీకుంటలోని రాజరాజేశ్వర సంఘం అలాగే ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రులు సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో నరేందర్ పాల్గొన్నారు.





## భారీ వర్షాలపట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌భాషా

**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న రెండు మూడురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆదివారం జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనేపథ్యంలో ప్రజలు ఎట్టిపరిస్థితుల్లోనూ విద్యుత్ స్తంభాలను తాకరాదన్నారు. పశువులను విడిచిపెట్టరాదని, రైతులు వ్యవసాయ కూలీలు పొలం పనులకు వెళ్లరాదన్నారు. ప్రాణ, ఆస్తినష్టం



కలుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శిథిలదశకు చేరుకున్న భవనాల్లో ఉండరాదని, పొర్లి పొంగే వాగులను ప్రజలు దాటే ప్రయత్నం చేయకూడదన్నారు. అత్యవసరం ఐతేనే బయటకురావాలని, ఏదైనా సమస్య తలెత్తితే ప్రజలు జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ నంబర్ 9052308621లో సంప్రదించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

వరంగల్ వార్త

## మాజీ ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



**నడికూడ,ప్రభాతవార్త:**

మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి జన్మదినం సందర్భంగా నడికూడ మండలంలోని బీఆర్ఎస్ నాయకులు,మాజీ ప్రజాప్రతినిదులు హన్మకొండలోని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇందులో బీఆర్ఎస్ నడికూడ మండల అద్యక్షుడు దుర్శెట్టి చంద్రమౌళి, గణపతి రెడ్డి, జయపాల్‌రెడ్డి, చందా కుమారస్వామి, నాగిరెడ్డి, సాంభశివరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, అశోక్, యూత్ నాయకులు రఘుపతి, శివ, రేవంత్, రంజిత్‌లు ఉన్నారు.

## సికెం ప్రభుత్వ కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

**పోచమ్మ మైదాన్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

కమిషనర్ కళాశాల, విద్యాశాఖ తెలంగాణ ఉత్తర్వుల ప్రకారం వరంగల్ దేశాయిపేట్‌లోని సికెఎం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో బోధించేందుకు అతిధి అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శశిధర్ రావు ఓ ప్రకటనలో కోరారు.

తెలుగు, హిందీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కామర్సు, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్సు, జువాలజీలో ఒక్కోపోస్టు, ఇంగ్లీషు, బోటనీలో రెండు పోస్టులకు యుజిసి నిబంధనల ప్రకారం పిజిలో 55 శాతం (ఎస్సీ, ఎ స్టీ వారికి 50) మార్కులు, నెట్, స్లెట్, సెట్, పిహెచ్‌డి అర్హత కలిగి ఉన్న అభ్యర్థులు ఈనెల పదో తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇంటర్వ్యూల తేదీలు తదుపరి తెలుపుతామని ప్రకటనలో పేర్కొన్నారు.

## గణపతి మండపాల్లో నిత్యాన్నదానాలు



**పోచమ్మ మైదాన్ కార్పొరేషన్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

వరంగల్ తూర్పు నియోజకవర్గం 22వ డివిజన్ పోచమ్మ మైదాన్‌లోని దేశాయిపేట్ రోడ్డు వర్తక సంఘం, 32వ డివిజన్ పరిధిలోని జ్యోతి కాలనీ వాసులు ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మహా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా స్థానిక కార్పొరేటర్ పల్లం పద్మ రవి, వర్తక సంఘం శాశ్వత అధ్యక్షులు లయన్ ఆడెపు రవీందర్ వారి మండపాల్లో ఏర్పాటు చేసిన అన్నదానల్లో పాల్గొని గణనాధునికి ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో వర్తక సంఘం సభ్యులు, జ్యోతి కాలనీ కమిటీ సభ్యులు అమూల్య శ్రీనివాస్, ఎమ్మె వేణు, ఆవుల వేణు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో కొలువైన గణనాథుడు

**- ప్రత్యేక అలంకరణలో మండపాలు**

**- వైభవంగా పూజలందుకుంటున్న గణేషుడు**

*జనగామ టౌన్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :*

జనగామ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, గ్రామాలు, పట్టణాలు, వీధి వీధిన ప్రజలు, యువకులు మండపాలను ప్రత్యేక అలంకరణ లద్వారా ఏర్పాటు చేసిన వాటిని విద్యుద్దీపాలం కరణలతో అలంకరించి వాటిల్లో బొజ్జగణప య్యలను కొలువుదీర్చారు. ఈసందర్భంగా శనివారంం బొజ్జగణపయ్యకు ప్రత్యేకపూజలు, అర్చనలు, ధూప దీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గణపయ్య నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా యువకులు ఉత్సాహంగా మండపాలలో ప్రతీరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేకపూజలు, నైవేద్యాలు సమర్పించడంతోపాటుగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుండడంతోపాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



**-వినాయక చవితి ప్రాశస్త్యం..:** భాద్రపద శుద్ధ చవితినాడు గౌరీశంకరులకు పుత్రుడిగా గణపతి అవతరించడంవల్ల గొప్ప పర్వదినంగా గణేష్ చతుర్థిగా జరుపుకుంటాం. విఘ్నాలను తొలగించి శుభాలను ఇచ్చే శుభదాయకుడు గణపతి. అన్ని శుభ కార్యాలలో ఆయనకే అగ్రపూజ చేస్తాం. జ్ఞాన నిర్వాణాలకు శాసకుడైన అధిపతి కనుకనే గణేశుడని పిలుస్తాం. విఘ్నాలు అనేవి అజ్ఞానం వల్ల కలుగుతాయి కావున అజ్ఞానంతో చేసే పనుల వలన విఘ్నాలు తప్పవు. గణపతి జ్ఞానానికి మూర్తి, కనుక జ్ఞానాన్ని పొందానికే ఆయన్ని పూజిస్తాం. ఆయన విఘ్న గణపతి మాత్రమే కాదు, వరద గణపతికూడా. గణపతిని శ్రద్ధా భక్తులతో పూజిస్తే తలపెట్టిన కార్యానికి సంబంధించిన దేవత కూడా సంతుష్టి పొంది ఫలాన్నిస్తుంది. గణపతిని పూజిస్తే శుత్రుక్షయం జరుగుతుంది. గ్రహబాధలు కూడా తొలగుతాయి. ముఖ్యంగా గణపతి ప్రకృతి దేవుడు. గణపతి పూజలందుకునేది ప్రకృతిలో లభించే వివిధ రకాల పత్రితోనే. అందుకే మనం ప్రకృతిలో లభించే సహజ సిద్ధ వాటితో అదికూడా నీటిలో ఆరోగ్యవంతంగా కరిగే బంకమట్టితో తయారుచేసిన గణపతి ప్రతిమలను ఆరాధించడం వలన ఆ గణపతికి మరింత చేరువగా పూజించుకొని అత్యంత ప్రీతిపాత్రులం కాగలం.

**- రఘునాథపల్లిలో..:** వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా తొలిరోజు శనివారం రఘునాథపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లోని వాడల్లో మహాగణపతి విగ్రహాలను ఏర్పాటచేసి ప్రత్యేకపూజలు, అర్చనలు చేశారు. ఎక్కడ చూసినా పండుగ వాతావరణం నెలకొంది. చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతీ ఒక్కరూ తమ తమ వీధుల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకున్నారు. లయన్స్‌క్లబ్ ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

## ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో మట్టిగణపతుల పంపిణీ

*జనగామ టౌన్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :*



ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జనగామ జిల్లా ఆధ్వర్యంలో మట్టివినాయక విగ్రహాలను శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జనగామ జిల్లా అధ్యక్షుడు బిజ్జాల నవీన్‌కుమార్ గుప్తా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించగా ముఖ్య అతిథులుగా జనగామ జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, ఏసీపీ పార్థసారథి, సీఐ దామోదర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున లింగయ్య, చాంబర్ గౌరవ అధ్యక్షులు పజ్జూరి గోపయ్య పాల్గొని భక్తులకు 2018మట్టి వినాయక ప్రతిమలను అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛంద సేవా సంస్థలు అందిస్తున్న సేవలను కొనియాడుతూ భక్తులుకూడా పర్యావరణ హితం కోరుకోవాలని, రంగులతో తయారుచేసిన విగ్రహాలను వినియోగించరాదని, జలజీవరాశులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్ అధ్యక్షులు పజ్జూరి జయహరి, జనగామ పట్టణ అధ్యక్షులు రామిని శివుడు, శరవిరాల ఉపేందర్, నాళ్ల మధు, తాడూరి సంతోష్‌రాజ్, రామిని శ్రీనివాస్, గట్టు శ్రీనివాస్, మరియాల లక్ష్మణ్, తుడుపునూరు చంద్రశేఖర్, వంగపల్లి చంద్రశేఖర్, బుస్స లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## యువకులకు విగ్రహాలు అందచేసిన విగ్రహదాతలు

*బచ్చన్నపేట, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :*

కాశీనగర్‌లో వినాయక చవితి పండుగ సందర్భంగా కాశీనగర్ గ్రామ ప్రజలు ఏర్పాటు చేస్తున్న వినాయక మండపానికి వినాయక విగ్రహం ఏర్పాటుకు గాను కాశీనగర్ గ్రామానికి చెందిన చొప్పరి కొమురయ్య, చొప్పరి రాజశేఖర్ రూ.11వేలు విరాళంగా విగ్రహానికి అందచేసినట్లు తెలిపారు.



## బాధితునికి ఆర్థికసాయం

*తరిగొప్పుల, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :*



తరిగొప్పుల మండల పరిధిలోని అక్కరాజుపల్లి గ్రామ నివాసి జొన్నగోని సిద్దులు బ్రెయిన్‌లో బ్లడ్‌క్లాట్ కావడంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇప్పటికే 14లక్షలతో చికిత్స పొందినా నయం కాకపోవడంతో దాతల సాయంకోసం ఎదురుచూస్తున్నారని తెలిసి అక్కరాజుపల్లి గ్రామ యూనిక్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆస్పత్రిలో బాధితుని కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.6వేలు ఆర్థికసాయం అందచేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు కుమ్మరి సంపత్, కుమ్మరి శేఖర్, బొల్లు ప్రవీణ్ పాల్గొన్నారు.

## పోచన్నపేట జీపీ కాలనీ మండపంలో గణపతి పూజలు

*బచ్చన్నపేట, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :*

మండలంలోని పోచన్నపేట గ్రామంలో గ్రామపంచాయతీ వద్ద ఏర్పాటుచేసిన గణేష్ మండపంలో వరసిద్ది వినాయక నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా శనివారం ప్రారంభమయ్యాయి. ఆదివారం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన మండపంలో గణపతి ప్రతిమను గ్రామపంచాయతీ గణేష్ ఉత్సవ కమిటీ కలిసి ప్రతిష్ఠించారు. ఈ ఉత్సవ కార్యక్రమంలో మేకల రాజిరెడ్డి విజయ లక్ష్మి దంపతులు తొలిరోజు పూజా కార్యక్రమం నిర్వహించగా రెండవరోజు ఉత్సవ కమిటీ సభ్యులు పూజా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం తీర్థప్రసాద వినియోగాలు, పులిహోర అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు గ్రామపంచాయతీ ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

## మాధవరెడ్డి మృతిపట్ల కొమ్మూరిప్రతాప్‌రెడ్డి పరామర్శ

*బచ్చన్నపేట, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :*

మండలంలోని చిన్నరాంచర్ల గ్రామ మాజీ సర్పంచ్ బాపురెడ్డి తండ్రి పిన్నింటి మాధవరెడ్డి (రిటైర్డు ఉపాధ్యాయుడు) మరణించాడు. ఈసందర్భంగా డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి త్రాప్‌రెడ్డి మాధవరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో బచ్చన్నపేట మండల అధ్యక్షులు నూకల బాల్‌రెడ్డి, మండల ముఖ్యనాయకులు హాజరై మాధవరెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు.

## జనగామ వార్త



జనగామ టౌన్, పాలకుర్తి,దేవరుప్పుల,తరిగొప్పుల, లింగాలఘణపురం

## మృతుల కుటుంబాలను పరామర్శించిన కాంగ్రెస్‌నాయకులు

*బచ్చన్నపేట, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :*



మండలంలోని చిన్నరాంచర్ల,గోపాల్‌నగర్, బండనాగారం గ్రామాలలో మృతిచెందిన పలువురు కుటుంబాలను మండలపార్టీ అధ్యక్షులు నూకల బాల్‌రెడ్డి పార్టీ సమక్షంలో డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పలువురు నాయకులు సందర్శించి పరామర్శించారు. ఈసందర్భంగా మృతుల కుటుంబాలను చిన్నరామన్‌చర్లలోని కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు పిన్నింటి కావ్యశ్రీరెడ్డి, గోపాల్‌నగర్‌కుచెందిన నసిరోద్దీన్, బండనాగారం కుచెందిన ఇజ్జగిరి రాములు కుటుంబాలను పరామర్శించారు. ఈసందర్భంగా మండలపార్టీ అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో చిన్నరాంచర్ల గ్రామంలో పిన్నింటి కావ్యరెడ్డి మామ మాధవరెడ్డి మృతిచెందగా ఆయన పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బండనాగారం గ్రామంలో జిల్లా నాయకులు ఇజ్జగిరి రాములు తండ్రి బాలయ్య అకాల మరణం చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో జంగిటి విద్యానాథ్, మాజీ మార్కెట్ చైర్మన్ మాసపేట రవీందర్‌రెడ్డి, అల్వాల ఎల్లయ్య, జిల్లా సందీప్, మసూద్, ఘనపురం నాగేష్, నిమ్మ కరుణాకర్‌రెడ్డి, కొప్పుల శ్రీధర్, దాచేపల్లి నర్సింగరావు, దిడిగ రమేష్, మాజీసర్పంచ్ ఆముదాల మల్లారెడ్డి, గుర్రపు బాలరాజు, భాస్కర్, హరీష్, పరుశరాములు, సత్తయ్య, సురేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేందర్, ఎల్లయ్య, కర్ణాకర్, యాదగిరి, సుధాకర్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

*రఘునాథపల్లి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :*



ఒకే పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు 20ఏళ్ళ అనంతరం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకు న్నారు. మండలంలోని ఖిలాషాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1999-2004సంవత్సరాల మధ్య చదువుకున్న 98మంది విద్యార్థులు అదేపాఠశాలలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఈ సమ్మేళనానికి విద్యాబుద్దులు నేర్పిన గురువులను ఆహ్వానించి వారిని సన్మానించి ఆశీస్సులు పొందరు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్తులు ఆనాటి మధుర స్మృతులను గుర్తుచేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు జయమ్మ, రాంధన్, శారద, రాజయ్య, మోజెస్, శ్రీను, విద్యానంద్, జ్ఞానేశ్వర్, శ్రీధర్, ఉపేందర్, చంద్రమోహన్‌రెడ్డి, పవన్‌కుమార్, ప్రవీణ్, ప్రస్తుత పాఠశాల హెచ్‌ఎం భారత రవీందర్,శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు పుప్పాల వేణుకుమార్, ఉడుత శ్రీనివాస్, చిర్ర మహేందర్, కుడికాల రాజశేఖర్, కె.రాజశేఖర్, లవకుమార్, సంజీవ, శంకర్, సమత, ప్రవళిక, మయూరి, పావని, ఉమ, స్వప్న, రేణుక, రజని, వేణు, కనకరాజు, భాస్కర్, శేఖర్, యాదగిరి పాల్గొన్నారు.

## శాంతియుత ర్యాలీని విజయవంతం చేయాలి


నల్లబెల్లి, సెప్టెంబర్ 8, (ప్రభాతవార్త)



గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతరం వైద్య సేవ అందిస్తున్న ఆర్ఎంపిపిఎంపి వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఎన్ఎంసి దాడులకు నిరసనగా నర్సంపేట పట్టణంలో సోమవారం జరిగే గ్రామీణ వైద్యుల నిరసన ర్యాలీలు విజయవంతం చేయాలని రాష్ట్ర గ్రామీణ ఆదర్శవంతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్ఎన్.హరిబాబు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని మండల అధ్యక్షుడు ఊటుకూరు చక్రపాణి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఎన్ హరిబాబు మాట్లాడుతూ తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌తో పాటు ఇండియన్ మెడికల్ కౌన్సిల్ ఇటీవల గ్రామాలలో వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపిపిఎంపి వైద్యులపై దాడులు చేయడంతో పాటు వారిపై కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇలాంటి దాడులు. అక్రమ కేసులు మరోమారు పునరావృతం కాకుండా ఉండటంతో పాటు మన గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలని కోరుతూ ఈ శాంతియుత ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని ఈ ర్యాలీకి మండలంలోని అన్ని గ్రామాల ఆర్ఎంపిపిఎంపి వైద్య సోదరులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు స్వామినాథన్, స్థానిక నల్లబెల్లి మండల ఆర్ఎంపిపి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన కౌన్సిలర్ పెండెం లక్ష్మీరామానంద్

నర్సంపేట, సెప్టెంబర్ 8, (ప్రభాతవార్త)



గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని నర్సంపేట పట్టణంలోని 19వ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరాత్రి ఉత్సవ వేడుకలకు టిపిసిసి సభ్యులు పెండెం లక్ష్మీరామానంద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వార్డు, పట్టణ ప్రజలకు వినయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా వార్డులో తొమ్మిది రోజుల పాటు నిర్వహించే గణనాథుడికి ఉత్సవాల్లో ప్రజలు భక్తి శ్రద్ధలతో పాల్గొని శాంతి సామరస్యతను పెంపొందించాలన్నారు. నర్సంపేట ప్రజలందరు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని అందరు మంచి ఆరోగ్యంగా ఉండాలని గణనాథున్ని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు యూత్ సభ్యులు, వార్డు ప్రజలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థినికి ఆర్థికసాయం అందించిన మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్

నర్సంపేట, సెప్టెంబర్ 8,(ప్రభాతవార్త)

నిరుపేద విద్యార్థిని ఉన్నత చదువుకు మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డా.ఏ.మోహన్‌రావు, నిర్వాహకులు, అర్షనపెల్లి వినోద్‌లు ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందించారు. ఇపిసెట్ ద్వారా ఇంజనీరింగ్ బిటెక్ ప్రథమ సంవత్సరం అడ్మీషన్ హైదరాబాద్‌లో ప్రముఖ మల్లారెడ్డి కాలేజీలో సీఎస్సీ విభాగంలో అడ్మిషన్ లభించగా ఈ నాలుగు సంవత్సరాలను పూర్తి చేయడానికి గాను కాలేజీ ఫీజు సుమారు 120000 అవసరమై ఉన్నందున కుటుంబం పేదరిక పరిస్థితులు వలన ఆ చదువుకు దూరం అవుతామని ఆందోళన ఉన్న పరిస్థితుల్లో నర్సంపేటలోని పూలే అంబేద్కర్ యువజన విభాగం సభ్యులు అట్టి విషయాన్ని నర్సంపేటకు చెందిన మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులను కలిసి విద్యార్థిని స్థితిగతుల గురించి పేదరికం గురించి తన ఉన్నతమైన చదువులకు సహాయం చేయాలని విజ్ఞప్తి చేయగా వెంటనే స్పందించి రానున్న నాలుగు సంవత్సరాల గాను ప్రతి సంవత్సరం కాలేజీ ఫీజు చెల్లించడానికి ముందుకు వచ్చారు. ఈ క్రమంలో హన్సిత, కాలేజీ ఫీజులో భాగంగా తన అడ్మిషన్ కొరకు రూ.40వేల రూపాయలను చెక్కు అందించారు.



## వానలకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

నర్సంపేట, సెప్టెంబర్ 8, (ప్రభాతవార్త)



నర్సంపేట పట్టణంలోని లెనిన్‌నగర్‌లో తెలంగాణ సాంస్కృతిక సారథి నర్సంపేట టీం లీడర్ నెల్లుట్ల సుమన్ ఆధ్వర్యంలో నిర్విరామంగా కొట్టే వర్షానికి అప్రమత్తంగా ఉండాలని ఆటపాటల ద్వారా ప్రజలను చైతన్య పరచడం జరిగింది. సంవత్సర మొత్తంలో కొట్టేటువంటి వానలు ఒకే రోజు కొట్టడం మూలంగా చాలా చెరువులు రోడ్లు కూడా దెబ్బతిని వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి కావున ప్రజలంతా, అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని వర్షాకాలం కావున ఈగలు దోమలు, చెత్తాచెదారం ఇంటి చుట్టు పక్కల లేకుండా పట్టణ ప్రజలంతా కూడా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునాచ్చరు. చిన్న దోమ కాటు వల్ల నిండు నూరేళ్ల బతికే మనిషి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని ఎవరు కూడా నిర్లక్ష్యం చేయకుండా చికెన్‌గున్యా, మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ జ్వరాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యోచన తాళ్ళ, సునీల్, పడిదం, రాజేందర్, గాదెపాక బాబు, బరిగల రవీందర్, చాంద్‌పాషా, ప్రశాంత్ రవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అనాథ బాలికలకు అండగా ఉప్పరపల్లి గ్రామస్తులు

చెన్నారావుపేట, సెప్టెంబర్ 8, (ప్రభాతవార్త)



తల్లిదండ్రులను కోల్పోయిన అనాథలుగా మారిన ఇద్దరు బాలికలకు మండలంలోని ఉప్పరపల్లి గ్రామస్తులు మరోసారి అండగా నిలిచి సామాజిక స్పృహను చాటుకున్నారు. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కుక్కల రమ్య, సింధుల తల్లిదండ్రులైన సరిత రాజులు పది సంవత్సరాల క్రితం మరణించగా వారి నాయనమ్మ కుక్కల ముచ్చాలు పెంచడం జరిగింది. గత 15 రోజుల క్రితం కుక్కల ముచ్చాలు అనారోగ్య రీత్యా మరణించడంతో వారిద్దరు దీన పరిస్థితి చూసి గ్రామంలోని ఉద్యోగ, వ్యాపార వేత్తలు గ్రామ పెద్దలు వారికి సహకారం అందించాలని సూచించడం జరిగింది. దీంతో గ్రామంలో ఉన్నటువంటి ప్రతి ఒక్కరి సహకారంతో 60వేల రూపాయలు అందగా కుక్కల రమ్య, సింధులకు పోస్టలన అకౌంట్ ద్వారా చేరి 30వేలు ఫిక్స్‌డిపాజిట్ చేయించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఉద్యోగ, వ్యాపారస్తులు వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ ఉపాధ్యాయుడు పులి దేవేందర్ ముదిరాజ్, అంది వెంకటేశ్వర్లు, కలామ్స్ ఫౌండేషన్ కార్యదర్శి పరికి మధుకర్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి యువతతోనే సాధ్యమని, యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా మంచి సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోస్ట్ ఆఫీసర్ కొనరెడ్డి సాంబరెడ్డి, వట్టె రవికిరణ్, రాజనాల రాజు, దొనకొండ కర్ణాకర్‌రెడ్డి, వట్టె శ్రీను, మాడుగుల కుమారస్వామి, గుల్లపల్లి స్వామి, మెరుగు కుమారస్వామి, కటుకూరి రాజు, కుక్కల రాజాలు, కుమార్, అశోక్, కుక్కల మహేందర్, సాంబరాజు, కుక్కల రమేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్దలతో గణపతి నవరాత్రి ఉత్సవాలు

దుగ్గొండి, సెప్టెంబర్ 8, (ప్రభాతవార్త)



మండలంలోని గణపతి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం 34 గ్రామాల్లో వినాయక చవితి పూజలను చేశారు. గ్రామాల్లో యువకులు మండపాల్లో వినాయక విగ్రహాన్ని ప్రతిష్టాపన చేశారు. చిన్నా పెద్దలు తలంటు స్నానాలు చేసి వినాయక విగ్రహాన్ని ప్రతిష్టాపన చేసి ఎలకపండు అరటిపండు, కంకి, సీతాఫలం, తీపి పదార్థాలు దేవునికి సమర్పించి పూజలు నిర్వహించారు.

# నర్సంపేట వార్త

నర్సంపేట,నల్లబెల్లి,చెన్నారావుపేట, దుగ్గొండి, నెక్కొండ, ఖానాపురం

## ఫర్టిలైజర్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక

నల్లబెల్లి, సెప్టెంబర్ 8, (ప్రభాతవార్త)



నల్లబెల్లి మండల ఫర్టిలైజర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా జరిగింది. మండల కేంద్రంలో జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో సభ్యులు దేవా సుధీర్‌బాబు, గోనె రాంబాబు, కారుకూరి శ్రీనివాస్, నాగెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరుగగా గతంలో అధ్యక్షునిగా కొనసాగిన పెద్దబోయిన బిక్షపతిని మరోమారు అధ్యక్షుడిగా సర్వసభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శిగా కాసం మదన్మోహన్‌రెడ్డి కోశాధికారిగా గంప కేదారిలను ఎన్నిక చేసినట్లు వారు తెలియజేశారు. అనంతరం కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.తమ ఎన్నికకు సహకరించిన మండలంలోని అన్ని ఫర్టిలైజర్ షాపు యజమానులకు నూతన కార్యవర్గం కృతజ్ఞతలు తెలియజేయడంతో పాటు తనపై నమ్మకంతో మరోమారు అధ్యక్ష పదవిని అప్పగించినందుకు గాను అసోసియేషన్ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని అధ్యక్షులు బిక్షపతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, వీరస్వామి, రాజ్‌కుమార్, శ్రీనివాస్, శోభన్, అమరేందర్, రఘోత్తంరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, శ్రీనివాస్, దేవ్‌సింగ్, మల్లయ్య, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది



దుగ్గొండి, సెప్టెంబర్ 8, (ప్రభాతవార్త)

మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన రేషన్ డీలర్ తాళ్లపెల్లి శ్రీనివాస్ ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఇదే గ్రామానికి చెందిన ఎలకంటి నర్సయ్య మృతిచెందారు. మృతుల కుటుంబాలను నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి- స్వప్న దంపతులు పరామర్శించి పార్థీవ దేహాలకు పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఎలా మృతి చెందారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పరామర్శలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, మాజీ ఎంపిపి కాట్ల కోమల భద్రయ్య, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సుకినె రాజేశ్వర్‌రావు, మండల ఉపాధ్యక్షులు తోటకూరి రాజు, నాయకులు యుగేందర్, ఆడెపు రాజు, బాలకృష్ణలు ఉన్నారు. కాగా మృతుని కుటుంబాన్ని రేషన్ డీలర్ల సంఘం డివిజన్ అధ్యక్షుడు సోలెంకి లింగన్న, రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు శంకేషి కమలాకర్‌లు పరామర్శించారు. ఈ పరామర్శలో డీలర్లు బైగాని శ్రీనివాస్, సుధాకర్, ఎండి.పాషా, రమేష్, సుమన్, మంజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వినాయక చవితి వేడుకలు

భూపాలపల్లి, సెప్టెంబర్08, ప్రభాతవార్త



వినాయక చవితి పర్వదినంను పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఘ్నాలను తొలగించే దేవుడు వినాయకుడు పండుగ సందర్భంగా ప్రతి ఇంటా వినాయకుని విగ్రహాన్ని అత్యంత భక్తి శ్రద్దలతో ప్రతిష్టించి పూజలు చేపట్టారు. పండుగ సందర్భంగా భక్తులు పిండి వంటలు చేసి వినాయకునికి సమర్పించారు. జిల్లాలోని



మండలాలు, పట్టణంలో వినాయక మండళ్ల వద్ద వినాయక విగ్రహాలను ప్రతిష్టించి వేద మంత్రోచ్చారణల మద్య పూజలు చేశారు. వినాయక మండళ్ల వద్ద ఆయా కమిటీలు నవరాత్రోత్సవాలు నిర్వహించుటకు ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని పలు కాలనీలలో వందలాది మండపాలను ఏర్పాటు చేసి విగ్రహాలను ప్రతిష్ట చేయగా ప్రతి రోజు భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఏ గండ్ర సత్యనారాయణరావు దంపతులు వేద పండితుల మంత్రోత్సారణ మద్య పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ మన దేశ సంస్కృతి సాంప్రదాయాలు ఇతర దేశాలకు ఆదర్శ ప్రాయంగా నిలుస్తున్నాయని అన్నారు. ప్రజలంతా వినాయక నవరాత్రి ఉత్సవాలను ఐకమత్యంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. మండపాల వద్ద నిభంధనల ప్రకారం పూజలు నిర్వహించుకోవాలని పోలీసులు కోరారు.



## సన్మానోత్సవం

మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 8 :



మణుగూరు పట్టణంలోని మౌనిక రెస్టారెంట్ ఫంక్షన్‌హాలు నందు సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నె రవి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం, జర్నలిస్ట్ డేను పురస్కరించుకొని మాల జర్నలిస్టులను, అధ్యాపకులను, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి మణుగూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దొడ్డి భద్రయ్య ముఖ్యఅతిధిగా హాజరై అధ్యాపకులను, ఉపాధ్యాయులను, జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి.సురేష్, పి.కృష్ణ, బి.సతీష్, ఉపాధ్యాయులు బి.శేఖర్, వి.రవి, శ్రీరాములు, బి.స్వరూపారాణి, డి.స్వరూపారాణి, బి.సరస్వతి, సంధ్య, రజిని, దానధర్మట్రస్ట్ చైర్మన్ జి.రాధ, న్యాయవాది జి.వెంకటరత్నం, సామాజిక కార్యకర్త కర్నె బాబూరావు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు గురుకుల డిగ్రీ కళాశాలలో స్పాట్ కౌన్సిలింగ్

**- ఆర్‌సీవో నాగార్జునరావు**

మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 8 :

మణుగూరు గురుకుల డిగ్రీ కళాశాల(బాలుర) నందు ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు స్పాట్ కౌన్సిలింగ్ ఏర్పాటుచేసినట్లు ఖమ్మం ఆర్‌సీవో నాగార్జునరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులు బీఏ, బీకాం(సీఏ), బీజెడ్‌సీ, ఎంబీజెడ్‌సీ, ఎంపీసీఎస్ గ్రూపుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 9న ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటలవరకు ఫైనల్ స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులు ఇంటర్ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు కుల, ఆధాయ ధృవీకరణ పత్రాలు, టీసీ, ఆధార్‌కార్డు రెండు జతల జిరాక్సు కాపీలతో పాటు 8పాస్‌ఫోటోలు తీసుకొని నేరుగా కళాశాలకు రావాల్సిందిగా ఆయన తెలిపారు.

## ఘనంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు

కరకగూడెం,ప్రభాతవార్త:

కరకగూడెం మండలంలో వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఊరు వాడ మొత్తం గణేశుని నామస్వరంతో మారుమోగుతుంది. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గణేశ్ మండపాల వద్ద విద్యుత్ కాంతుల శోభ సంతరించుకుంది. మండలంలోని ఏ గ్రామంలో చూసినా వివిధ రూపాల్లో వినాయకుడి విగ్రహాలు కళకళలాడుతున్నాయి. మండపాల వద్దకు భక్తులు పెద్ద ఎత్తున చేరుకుని పూజలు నిర్వహిస్తున్నారు.

## వాస్తుసామ్రాట్ పదిరావూరికి మాతృవియోగం

అశ్వాపురం, సెప్టెంబర్08, ప్రభాతవార్త.

మండలపరిధిలోని మొండికుంటకు చెందిన వాస్తుసామ్రాట్, డాక్టరేట్ పదిరావూరి శ్రీనివాసాచారికి మాతృవియోగం కలిగింది. ఆయన మాతృమూర్తి పదిరావూరి వెంకటసుబ్బమ్మ(80)గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఖమ్మంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందింది. ఆమె పార్థివదేహాన్ని స్వగ్రామం మొండికుంటకు తరలించి సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె మృతదేహాన్ని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, మొండికుంట మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్‌లు మర్రి మల్లారెడ్డి, మేడవరపు సుధీర్, ఎంపీటీసీ కమటం నరేష్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, సీనియర్ నాయకులు జాలె రామకృష్ణారెడ్డి, సూదిరెడ్డి గోపిరెడ్డి, గ్రామస్తులు కూసుకుంట్ల శ్రీనివాసరెడ్డి, తూము సత్యనారాయణ, తునికేసి సురేందర్‌రెడ్డి, పాటి ప్రకాశ్‌రెడ్డి, రామగిరి భాస్కర్, కమటం వెంకన్న, కుందూరు శ్రీనివాసరెడ్డి సందర్శించి నివాళులు అర్పించారు.

## గౌతమీనగర్ కాలనీగేటు సెక్యూరిటీ సిబ్బందిపై వివక్ష తగదు

అశ్వాపురం, సెప్టెంబర్08, ప్రభాతవార్త.

భారజల కర్మాగార ఉద్యోగులు నివాసముండే గౌతమీనగర్ కాలనీగేటు ముందు యేండ్ల తరబడి సెక్యూరిటీ గార్డులుగా సేవలందిస్తున్న స్థానికులను కాదని, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు ప్రాధాన్యతనిస్తూ వారిని నియమించడం ఎంతవరకు సబబని స్థానిక సెక్యూరిటీ సిబ్బంది నిలదీస్తున్నారు. సెక్యూరిటీ గార్డులుగా ఎక్స్ సర్వీస్‌మెన్‌లను నియమించి, ఇప్పటివరకు విధులు నిర్వహించిన సెక్యూరిటీ గార్డులకు పరిహారం చెల్లించక పోవడంతో వారి భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారిందని, యాజమాన్య తప్పిదాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించడంలేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. తమకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేవరకు పోరాడుతామని తెలిపారు.



జయశంకర్ వార్త

జయశంకర్ భూపాలపల్లి, భూపాలపల్లి రూరల్, మల్హర్‌రావు, రేగొండ



## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 8 :



మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రజాభవన్ నందు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతులమీదుగా ఆదివారం మణుగూరు మండలంలోని లబ్ధిదారులకు రూ.1.16లక్షల విలువగల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు పీర్నాకి నవీన్, సామా శ్రీనివాసరెడ్డి, కూచిపూడి బాబు, పాతూరి వెంకన్న, రహీం తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి గుర్తింపు సంఘం కాలపరిమితి రెండు ఏండ్లు మాత్రమే ఉండాలి

**- మణుగూరు ఏరియా సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి వి.వెంకటరత్నం**

మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 8 :



సింగరేణిలో ఎన్నికైన కార్మిక సంఘాల గుర్తింపు కాలపరిమితి రెండు ఏండ్లు మాత్రమే ఉండాలని మణుగూరు ఏరియా సీఐటీయూ బ్రాంచి సెక్రెటరీ వి.వెంకటరత్నం అన్నారు. ఆయన ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సింగరేణి సంస్థ యాజమాన్యం నిబంధనలు ఖచ్చితంగా అమలుచేయాలని, సింగరేణిలో ఎన్నికైన కార్మికసంఘాల గుర్తింపు పత్రానికి రెండు సంవత్సరాల కాలపరిమితి మాత్రమే ఉండాలన్నారు. ఎన్నికలు జరిగి 9నెలలు అయినా ఇప్పటివరకు గుర్తింపు పత్రం ఇవ్వలేదన్నారు. ఇందుకు యాజమాన్యమే బాధ్యత వహించాలన్నారు. లక్ష్మణ్‌రావు, రామ్మూర్తి, ఈశ్వర్‌రావు, విల్సన్‌రాజు, బొల్లం రాజు, ప్రభాకర్ రావు, భిక్షపతి, ముత్తిరెడ్డి, సుమన్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

## మణుగూరులో పోలీసుల తనిఖీలు

మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 8 :



మణుగూరులో డీఎస్పీ రవీందర్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఐ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ప్రధాన కూడళ్లతో పాటు పీవీకాలనీ క్రాస్‌రోడ్డు, సురక్షాబస్టాండ్ తదితర ప్రాంతాల్లో నార్కోడీడాగ్‌తో తనిఖీలు జరిపారు.

## ఏడీఎంఎస్ బైక్‌షోరూమ్ ప్రారంభం

మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 8 :



మణుగూరు మండలం గుట్టమల్లారం గ్రామంలో ఏడీఎంఎస్ సైకం బ్రదర్స్ ఈమోటర్స్ ఈబైక్ నూతన షోరూమ్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షోరూమ్ యాజమాన్యం, మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ముష్టికుంట్లలో డిప్యూటీ సిఎం భట్టి పర్యటన





**బోనకల్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామంలో బిసి కాలనీలో ఇండ్లలోకి వరద నీరు చేరడంతో కాలనీ వాసులకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీనిలో భాగంగా ఆదివారం ముష్టికుంట్ల గ్రామంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క పర్యటించారు. వరద బాధితులను పరామర్శించారు. వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నాయకులు, గ్రామస్తుల కోరిక మేరకు వరద మంపునకు గురి కాకుండా ఆర్అండ్బి రోడ్డు వెంబడి డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరడంతో వెంటనే స్పందించి అంత అంచనా వేసి పంపాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ముష్టికుంట్లలో గ్రామంలో పల్లె దవాఖాన శిథిలావస్థకు చేరడంతో దాని చుట్టూ నీరు చేరి కూలిపోయే ప్రమాదం ఉన్నందున డిప్యూటీ సిఎం భట్టి దృష్టికి నాయకులు తీసుకెళ్లగా వెంటనే భట్టి అధికారులను పరిశీలించాలని ఆదేశించారు. అవసరమైతే పల్లెదావఖానా నూతన భవనానికి అంచనా వేసి పంపిచాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో ప్రజలు వివిధ సమస్యలపై డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గాలి దుర్గారావు, పిసిసి సభ్యులు పైడిపల్లి కిశోర్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భూక్యా సైదా నాయక్, చేబ్రోలు వెంకటేశ్వరరావు, పిల్లల మర్రి నాగేశ్వరరావు, ఎర్రంశెట్టి సుబ్బారావు, బిపి నాయక్, భూక్యా భద్రు నాయక్, వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



# కోట్ల విలువైన పైపులు ఏమయ్యాయి ?

## ఆర్‌డబ్ల్యుఎస్ నిద్రపోతున్నదా ? దోపిడీకి దన్నుగా ఉన్నదా

## తమకే పాపం తెలియదంటున్న అధికారులు

## రామగోవిందాపురంలో రాజుకుంటున్న చిచ్చు

**సత్తుపల్లి-ప్రభాతవార్త**

నాలుగేళ్ళ క్రితం బోరుబావుల అవసరాల కోసం తెచ్చి పెట్టిన కోట్ల విలువైన కేసింగ్ పైపులు దోపిడీకి గురవడం ఆలస్యంగా బయట పడింది. వాస్తవంగా 600 కి పైగా తెచ్చి పెట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. అందులో ఇప్పుడు చాలావరకూ మాయమయ్యాయి. ఒక్కో దాని విలువ రూ.15వేలు పైమాటేనట. 20 అడుగుల నిడివితో 10-11-12 గేజిలు గల ఈ విలువైన సంపదని సత్తుపల్లి మండలం రామగోవిందాపురం ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయంలో దింపారు. ఇది నాలుగేళ్ల క్రితం మాట. చుట్టుపక్కల బోరుబావుల నిర్మాణాలకోసమని వీటిని మందుగానే ఇక్కడికి చేర్చుకున్నారు. బాగానే ఉంది. కానీ గడచిన ఇన్నేళ్ళుగా సంబంధిత అధికారులు వాటిని వాడకపోగా, కనీసం వాటివైపు కన్నెత్తి చూడకపోవడంతో అందులో చాలావరకూ దోపిడీకి గురయ్యాయి. ఎవడూ పట్టించుకోకపోతే ఎలా ఉంటుంది. ఎవరికి దొరికింది వారు పట్టుకుపోరా ఏంటి ? ఇది ప్రజల సొమ్ము. దీనికి ఆ అధికారులే గార్డియన్లుగా ఉండాల్సింది పోయి ఎవడికి పుట్టిన బిడ్డలే అన్న చందంగా వ్యవహరించినట్లు తీవ్ర విమర్శలు ప్రజలనుంచే వినిపిస్తున్నాయి. ప్రజలెవరో అన్నారని కాదుగానీ..ఇంత ఖరీదైన మెటీరియల్‌ని ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో దింపినప్పుడు వాటిని కాపుకాయాల్సిన కనీస బాధ్యత వీళ్ళకి ఎందుకు లేకుండా పోయిందో..ఉన్నతాధికారులు నిగ్గదీయాల్సిందే. ఈసందర్భంగా మరో ఆరోపణ తప్పకుండా చెస్తారు. అదేమంటే ఈ దోపిడీకి పరోక్షంగా అధికారులే సహకరించారేమోనని. నిజమే ఇదీ వ్యక్తమయింది. కావాలని ఎవరో వీటిని తెగనమ్ముకున్నారా అనే అనుమానాలు కూడా లేకపోలేదు. ఇందుకు ఆధారాలు లేకపోయినా ప్రజల ఆస్తిని కాపాడాల్సిన వాళ్ళే కళ్ళు మూసుకున్నప్పుడు, అమూల్యమైన సంపద అదృశ్యమైనప్పుడు, ఇందుకు బాధ్యులెవరైతే ఉంటారో వాళ్ళీ నిందలను మోయాల్సిందే. ఇదొక కోణం కాగా ఇందులో ఇంకోటి కూడా ఉన్నది. బోరు బావుల నిర్మాణానికి పాలనాపర మంజూరీలు (అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్లు) వచ్చి ఉండబట్టే అంత ఖరీదైన కేసింగ్ పైపులను డిపార్ట్‌మెంట్ డంప్ చేసి ఉండాలి. మరి ఇన్నేళ్ళుగా ఈపైపులను వినియోగించకుండా దుర్వినియోగమవడానికి కారణాలేంటనేది ఆలోచించాలి. బోరు బావుల నిర్మాణం జరగలేదా ? జరగకపోతే ఎందుకు జరగలేదు ? ముందు మంజూరీ ఇచ్చి ఆ తరువాత పథకాన్ని ఆపేశారా ? అలా అడ్డగోలుగా ఆపేసి ఉంటే ఆలీ చూలూ లేకుండా అంత అర్జంట్‌గా కేసింగ్ పైపుల్ని ముందుగానే ఎందుకు కొన్నారు ? ఎక్కడ కొన్నారు ? ఎంతకి కొన్నారు ? ఆ పైపుల డేటాఫ్‌మాన్యుఫ్యాక్చర్ ఎప్పుడు ? వీటి నాణ్యతలో ఏదేని లోపాలుంటే ఎవరైనా అధికారులతో కుమ్మక్కయి వీటిని ఆర్‌డబ్ల్యుఎస్‌కి అంటగట్టారా ? ఇది ఒకవేళ నిజమైతే ఇందుకు బాధ్యులెవరు ? అసలీ అనుమానాలు ఎంతవరకూ నిజం ? ఈ అనుమానాలను వ్యక్తం చేస్తున్నది మేం కాదు స్థానిక ప్రజలు. వీటన్నింటికీ అధికారులు సమాధానం చెప్పితీరాలి. ఎత్తుకుపోయిన పైపుల వెనుక శాఖాపరమైన సాకారమున్నదా అనేది కూడా తెలాలి. ఇందులో ఇంకో ట్విస్ట్ ఏమంటే సంబంధిత శాఖలేవీ అసలీ పైపులు తమవి కాదంటే తమవి కాదంటున్నారు. ఐతే మరి పైపున్న భగవంతుడివేమో నిగ్గు తేల్చాలని అందరూ డిమండ్ చేస్తున్నారు.



## జిల్లా యంత్రాంగం సూచనలను పాటిస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు**

**కొత్తగూడెం క్రైం, సెప్టెంబర్ 8 - ప్రభాతవార్త:**

రాబోయే రెండు రోజుల్లో జిల్లాకు భారీ వర్ష సూచన నేపద్యంలో జిల్లా అధికార యంత్రాంగం సూచనలను పాటిస్తూ ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్‌రోజు ఒక ప్రకటనను విడుదల చేశారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దని సూచించారు. వరద నీటితో ప్రమాదకరంగా మారిన రోడ్లను దాటడానికి ప్రయత్నం చేయవద్దని సూచించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, నదులు, చెరువుల వద్దకు చూడానికి వెళ్లి ప్రమాదాలకు గురికావొద్దని తెలిపారు. వర్షాలు తగ్గే వరకు వ్యవసాయ పనులకు, పశువులు కాయడానికి వెళ్లకుండా ఉండాలని సూచించారు. ఇతర శాఖల అధికారుల సమన్వయంతో జిల్లా పోలీసుశాఖ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. భారీ వర్షాల కారణంగా అకస్మాత్తుగా వాగులు, నదులలో నీటి మట్టం పెరిగే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంత ప్రజలు అధికారుల సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన పునరా వాస కేంద్రాలకు తరలి వెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

## నేటి ప్రజావాణి రద్దు

**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్8 - ప్రభాతవార్త:**

భారీ వర్షాలు కురుస్తోన్నందున సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడంలేదని జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తెలిపారు. ప్రజలు కలెక్టరేట్‌కు రావద్దని ప్రకటనలో తెలిపారు.

# వరదల వల్ల జరిగిన నష్టంపై సమగ్ర సర్వే





**క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్న అధికారులు**

**అధికారుల పనితీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:**

మున్నేరు వరద ముంపు ప్రాంతాల్లో అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో నష్టం వివరాలను సమగ్రంగా సేకరిస్తున్నారని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఆదివారం కాల్వొడ్డు, జూబ్లీక్లబ్, రజబ్‌అలీ పార్క్ ఏరియా, జూబ్లీపుర, మున్నేరు వరద ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటించి బాధితులతో మాట్లాడారు. ఇటీవల వచ్చిన వరద ఎన్నడూ లేని విధంగా జూబ్లీక్లబ్ వరకు రావడానికి గల ప్రదాన సమస్యలను పరిష్కరించడం కోసం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానికులు చిరు, వ్యాపారులతో మాట్లాడి వరద ముంపు ఇబ్బందులను అడిగి తెలసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో లేని విధంగా వర్షం బీభత్సం సృష్టించిందని పలు కుటుంబాలకు ఆస్తి నష్టం అపారంగా జరిగిందని బాధితులను ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని జరిగిన నష్టం వివరాల సేకరణ ప్రక్రియ చురుగ్గా కొనసాగుతుందని చెప్పారు. మున్నేరు వరద బాధితుల సమగ్ర సమాచారం వేగవంతంగా ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో ఇబ్బందులు, రోడ్డులు, సైడ్ కాలువలు, విద్యుత్‌లైన్‌లు, వివిధ మౌలిక సదుపాయాలను ప్రాథమిక అంచనాలతో తక్షణ మరమ్మత్తులు పూర్తి చేస్తామన్నారు. పర్యావరణంలో వస్తున్న మార్పుల కారణంగా ప్రకృతి విపత్తులు అసాధారణ స్థాయిలో ప్రజలను ఇబ్బందులు పెడుతున్నాయని అన్నారు. వాతావరణ శాఖ చెప్పిన సూచనల ప్రకారం మున్నేరు ఎగువన ఉన్న వర్షాభావం వల్ల ముందస్తు ముప్పులను గమనించి మున్నేరు పరివాహక లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు రావాలని కోరుతూ ఇంటింటికి తిరిగి ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. దయచేసి అధికారులకు, సిబ్బంది మున్నేరు ముంపు ప్రదేశాల స్థానికులు సహకరించాలని కలెక్టర్ అన్నారు. రానున్న నాలుగైదు రోజులు వర్షాల పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, జ్వరం,సీజనల్ వ్యాదులను నిర్లక్ష్యం చేయవద్దని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ పర్యటన సందర్భంగా శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ట తదితరులు ఉన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**భద్రాచలంకల్చరల్, ప్రభాతవార్త :**

మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడాలని రాబోయే భావి తరాలకు ఉజ్వల భవిష్యత్ అందించాలనేదే ముఖ్య ఉద్దేశ్యమని 9ఎక్స్‌ప్రెస్ న్యూస్ టీం ఆధ్వర్యంలో మట్టి గణనాధుని విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానం సెంటర్ నందు వినాయక చవితి సందర్భంగా 1000 మట్టి విగ్రహాలను పంచుతూ పర్యావరణంపై అవగాహన కల్పిస్తూ భక్తులు పర్యావరణ పరిరక్షణకై మట్టితో తయారు చేసిన విగ్రహాలకు పూజా కార్యక్రమాలను నిర్వహించాలని కోరుతూ ఈ కార్యక్రమంలో చేపట్టాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిందా, జర్నలిస్టులు లక్ష్మీకాంత్, రవికుమార్, తమ్మళ్ల రాజేష్, పుష్పగిరి, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల సమస్యలు అధికారులకు పట్టవా..!?

**వస్రాం తండాలో**

**తాగునీటి,పారిశుద్ధ్యం ఇబ్బందులు**

**జిపి కార్యదర్శి పనితీరుపై**

**ఆగ్రహం వ్యక్తం చేస్తున్న**

**తండా వాసులు**

నెల్లికుదురు, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త



మండలంలోని వస్రాం తండాలో తాగటానికి కనీసం నీటి వసతి లేక ఏకంగా తండ ప్రజలు మొత్తం ఇబ్బందులు పడ్తున్న విషయాన్ని అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకునే అధికారులు లేకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, సమస్యలను పట్టించుకునేది ఏవ్వరని తండ ప్రజలు ప్రశ్నిస్తున్నారు ? శనివారం తండాలో మంచినీటికోసం ఖాళి బిందెలతో గిరిజన మహిళలు తండాలో నిరసన వ్యక్తం చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది.ఆదివారం తండ ప్రజలు విలేకరులతో మాట్లాడుతూ....అధికారుల నిర్లక్ష్యంతో తండాలో పారిశుద్ధ్యం లోపించిందని,మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో వ్యవసాయ బావులే తాగునీటికి జీవనాధరంగా మారిందని,వ్యవసాయ బావుల నీటిని తాగడంతో విష జ్వరాలు వచ్చే ప్రమాధం పొంచి ఉందని,తండాలో రాత్రి అయితే వీది లైట్లు లేకపోవడంతో రాత్రి విష సర్పాల బారిన పడే ప్రమాధంతో భయంతో బతుకుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యలన్నింటిని గ్రామ పంచాయతీ కార్యదర్శి సమర్జిత్‌కు తండ ప్రజల ఎన్ని సార్లు చెప్పినా మాటలు పట్టించుకోవడం లేదని,తండావాసుల ఇలా సమస్యలలతో కొట్టుమిట్టాడుతూ ఇబ్బందులు పడటానికి పంచాయతీ కార్యదర్శే కారణమని ఆరోపిస్తున్నారు.ఇది ఇలా ఉంటే గ్రామ సమస్యలను పరిష్కరించాల్సిన గ్రామ ప్రత్యేక అధికారి గానీ,మండల పంచాయతీ అధికారి కానీ పట్టించుకోకపోవడం దారుణం అన్నారు.మేము గిరిజనులము ఐనందుకే మా తండా ప్రజలు ఇబ్బందులకు గురౌతున్నా అధికారులు పట్టించుకోవడం లేదా అని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు సంబందిత పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకుని తండ ప్రజల కష్టాలు తీర్చాలని,లేని యేడల తండా ప్రజలంతా ఏకమై జిల్లా కలెక్టర్ కార్యలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

## కొట్టుకుపోయిన ప్రయాణీకులను కాపాడిన ఎస్సై

చిన్ననాగారం, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త



మండలంలోని చిన్ననాగారం గ్రామంలో చెరువు అలుగు పోస్తుండటంతో కేసముద్రం,నెల్లికుదురు ప్రధాన రహాదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.కాగ శనివారం మండలంలోని పాతతండాకు చెందిన ఇస్లావత్ మోహాన్ వరుద వేగాన్ని గమనించకపోవడంతో బైక్‌తో సహా కొట్టుకుపోయి,మద్యలో అదృష్ట వశాత్తు చెట్టును పట్టుకుని వహానాన్ని వదిలేసి బైయటకు వస్తున్న క్రమంలో గమనించిన ఎస్సై రమేష్ బాబు స్థానిక గ్రామ యువకులు ఉడుత అనీల్,నాయిని కుమార్,బత్తిని శ్రీధర్,గుండ్ల మురళి,సంగెం అనీల్ సహాయంతో వ్యక్తితోపాటు వాహానాన్ని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

## ఉచిత ఆరోగ్య శిబిరం

దంతాలపల్లి, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంను జిల్లా వైద్యశాఖ అధికారి డా.మురళిధర్ పరిశీలించారు.కాగ వైద్య శిభిరంలో 97మంది రోగులకు వివిద రఖాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందచేసినట్లు స్థానిక డా.చైతన్య తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వివేక్‌రామ్,ఎంపిఓ అప్సర్‌పాష,హెల్తు సూఫర్‌వైజర్ మంగమ్మ,హెల్తు అసిస్టెంట్ శ్రీనివాస్‌లు,ఏఎన్ఎం,ఆశాలు పాల్గొన్నారు.

## జయ్యారంలో ఆరోగ్య శిభిరం

చిన్నగూడూరు,సెప్టెంబర్8,ప్రభాతవార్త

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ప్రజలు సీజనల్ వ్యాదుల బారిన పడకుండా మండలంలోని జయ్యారం గ్రామంలోని 2వ వార్డులో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంఎల్‌హెచ్‌పి కె.తార ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య శిభిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో పలువురికి మలేరియా, డెంగ్యూ తదితర వైద్య పరీక్షలు చేయగా నెగిటివ్ వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని తద్వారా వ్యాదుల బారిన పడకుండా ఉండవచ్చని అన్నారు. గ్రామంలోని పలువురికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఎం.శ్యామల, ఆశా వర్కర్లు చెవుల అనూష, తోకల గౌతమి తదితరులు పాల్గొన్నారు.

## జలగం శేఖర్ సేవలు వెల కట్టలేనివి

తొర్రూరు,సెప్టెంబర్ 08,ప్రభాతవార్త



సమాజాన్ని జాగృతం చేయడంలో జర్నలిస్టు జలగం శేఖర్ సేవలు వెలకట్టలేనివని ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు దూలం శ్రీనివాస్,టీయూడబ్ల్యూజే (143)జాతీయ సభ్యులు తీగల కృష్ణారెడ్డిలు అన్నారు.ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు జలగం శేఖర్ అకాల మృతికి సంతాపంగా ఆదివారం డివిజన్ కేంద్రంలోని అమరవీరుల స్తూపం ఎదుట డివిజన్ పరిధిలోని జర్నలిస్టులు ఘన నివాళులు అర్పించారు.మీడియాలో శేఖర్ పాత్రను జర్నలిస్టులు గుర్తు చేసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టుల దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర ఎనలేనిదని,కుటుంబ క్షేమం వదిలి సమాజ క్షేమమే లక్ష్యంగా జర్నలిస్టులు అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు.ప్రాణాలను సైతం లెక్కచేయకుండా జర్నలిస్టులు పనిచేస్తున్నారని,వారిని మీడియా సంస్థలు,ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు.ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో శేఖర్ తనదైన గుర్తింపు తెచ్చుకున్నాడని,అందరితో కలివిడిగా ఉండి స్నేహభావం చాటే వాడని గుర్తు చేశారు.జర్నలిస్టుల సమస్యలపై పోరాటం చేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశాడని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో ఐజియూ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు నాగపూరి అశోక్ గౌడ్,143 జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ రాజు,ఎలక్ట్రానిక్,ప్రింట్ మీడియా జిల్లా ఉపాధ్యక్షులు దేవరకొండ కృష్ణ ప్రసాద్,గజ్జెల వినోద్ రెడ్డి,జర్నలిస్టులు ఇమ్మడి రాంబాబు,కృష్ణ,యాదగిరి నాయక్,సుమన్,జిలుకర రాజు ఏకాంతం, సాంబశివ,వీరాంజనేయులు,ఎండి అమీర్, పూర్ణచందర్, సురేందర్,మహేష్,కిషన్,ఉపేందర్,దిలిప్,దేవేందర్,కిరణ్,సారయ్య తదితరులు పాల్గొన్నారు.

## వర్షానికి కూలిన ఇండ్లు

నెల్లికుదురు,సెప్టెంబర్ 7, ప్రభాతవార్త



ఇటీవల మండలంలో కురిసన బారీ వర్షాలకు నీటిలో నానిన ఇండ్లు అకస్మాత్తుగా కూలుతున్నాయి. ఇప్పటికే మండలంలో అనేక ఇండ్లు నేలమట్టం కాగ,ఆదివారం మండల కేంద్రానికి చెందిన గుండా రాజేందర్,బొమ్మరాతి పాపయ్య ఇండ్లు కూలినట్లు బాదితులు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

# తొర్రూరు వార్త

## బారీ వర్షానికి ఇంట్లోకి చేరిన నీరు

ఇనుగుర్తి,సెప్టెంబర్ 8, ప్రభాతవార్త



గత రెండు రోజులుగా కురుస్తున్న బారీ వర్షాలకు మండలంలోని చిన్నముప్పారం గ్రామానికి చెందిన రాయిలీ ఉప్పలయ్య ఇంట్లోకి వర్షపు నీరు చేరడంతో ఇంట్లో ఉన్న 3క్వి బియ్యంతోపాటు 6 యూరియా భస్తాలో నీటిలో తడిసిపోగా,కుటుంబ సభ్యులంతా రాత్రంతా ఇంట్లోకి చేరిన వర్షం నీటిని ఎత్తిపోస్తు ఆందోళనతో బిక్కుబిక్కుమంటు గడిపామని,ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు.

## మెడికల్ క్యాంపులను పరిశీలించిన శ్రీనివాస్

మహబూబాబాద్ నెహ్రూసెంటర్,సెప్టెంబర్8,ప్రభాతవార్త:



ఇటీవల కురుస్తున్న వర్షాల దృష్ట్యా సెలవులు లేకుండా పనిచేయాలని కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం కూడా వైద్యసిబ్బంది యుపిఎస్‌సి, బస్తీదవాఖాన సిగ్నల్‌కాలనీలో ఆరోగ్య శిభిరాలు ఏర్పాటు చేయగా సబ్‌యూనిట్ ఆఫిసర్ వడ్డెబోయిన శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిని పరిక్షించి వారికి మందులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ సమయంలో వేడి పదార్థాలు తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని త్రాగాలన్నారు. ప్రజలు తమ పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని దోమలు కుట్టకుండా దోమ తెరాలు వాడాలని సూచించారు. వైద్య సిబ్బందికి ఎలాంటి సెలవులు లేవని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నర్మద, స్టాఫ్‌నర్సు భవాని, సువర్ణ, విజయ, అనిత, ఫార్మసిస్ట్ సృజన, హెల్త్ అసిస్టెంట్ రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో రైతులకు నష్టపరిహారం

చెన్నారావుపేట, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త

నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవతో ఆదివారం పరిహారం అందుకున్నారు. గత కొన్ని రోజుల క్రితం మొక్కజొన్న విత్తనాలు కావేరీ సీడ్స్ వారు చెన్నారావుపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు కొనుగోలు చేసి చెలకలో విత్తారు. కానీ విత్తనాలు సరిగ్గా మొలకెత్తక రైతులు నష్టపోయినారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవతో రైతులకు ఎకరాకు 55వేల రూపాయల చెక్కులను సిఐ నెక్కొండ ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, మండల ఉపాధ్యక్షులు నన్నెబోయిన రమేష్‌యాదవ్, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాదు మధుసుధన్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి బిళ్ళ ఇంద్రసేనరెడ్డి, ఈర్యనాయక్, రవి, భద్రు పలు గ్రామాల రైతులు ఉన్నారు.



## వాడవాడన గణపయ్యల సందడి

గూడూరు, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త

మండలంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందడి కొనసాగుతున్నది. మండలంలోని దాదాపు అన్ని గ్రామలు, ఆవాస ప్రాంతాల్లో ఉత్సవాల నిర్వాహకులు మండపాలు ఏర్పాటు చేసి గణపతి విగ్రహాలను ప్రతిష్టించి నిత్య పూజలు ప్రారంభించారు. ఈనెల 7న వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇంటింటా గణపతి పూజలు నిర్వహించి ఉండ్రాళ్ల



వైవేద్యంగా పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా అదేరోజు సాయంత్రం పలు చోట్ల ఏర్పాటు చేసిన గణపతి మండపాలకు బ్యాండు మేళాలు, నృత్యాలు, బాణాసంచా పేలుళ్ల మధ్య విగ్రహాలను ఆనందోత్సాహాల మధ్య తరలించిన నిర్వాహకులు తొలిపూజలతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. మండల కేంద్రంలోని పలు వీధుల్లో కూడా వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసారు. స్థానిక శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో పంచముఖ గణపతి విగ్రహాన్ని, సనాతన శివాలయంలో నృత్య గణపతి విగ్రహాన్ని ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. చిన్న పిల్లలు మొదలుకొని యువకులు, పెద్దల వరకు తమతమ ప్రాంతాల్లో గణపతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పోటీ పడుతున్నారు. చిన్నచిన్న విగ్రహాలతో పాటు భారీ విగ్రహాలను పలు చోట్ల ఏర్పాటు చేసారు. తొమ్మిది రోజుల పాటు గణపతి



మండలపాల వద్ద నిత్య పూజలు నిర్వహించి పదవ రోజున తమకు అందుబాటులో ఉన్న నీటి వనరుల్లో విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. మండలంలో గత రెండు సంవత్సరాల లెక్కలను బట్టి 130 మండపాల వరకకు ఏర్పాటు చేయగా ఈసారి ఈ సంఖ్య కొంత తగ్గినట్లు తెలుస్తున్నది. ఇటీవలి కొద్ది రోజులుగా నిరంతరాయంగా కురుస్తున్న వర్షాల కారణంగా ఉత్సవాల నిర్వహణకు కొన్ని చోట్ల వెనుకడుగు వేసినట్లు తెలుస్తున్నది. గణేష్ మండపాల ఏర్పాటుకు పోలీసుల నుండి తప్పనిసరి ముందస్తు అనుమతులు పొందాలన్న ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో గూడూరు మండలంలో మండపాల ఏర్పాటు కొరకు ఆదివారం సాయంత్రం వరకు ఆన్‌లైన్ ద్వారా 87 ధరఖాస్తులు అందినట్లు తెలిసింది. మరో 40 వరకు ధరఖాస్తులు అందే అవకాశం ఉందని అంటున్నారు. ఇక మండపాల వద్ద ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే దిశగా స్థానిక విద్యుత్ అధికారులు తమ ప్రయత్నాలను ప్రారంభించినట్లు తెలిసింది. గూడూరు విద్యుత్ సెక్షన్‌లో ఆదివారం సాయంత్రం వరకు మండల కేంద్రంలోని 12 మండపాలతో కలిసి మొత్తం 28 కనెక్షన్లను అధికారికంగా ఇచ్చినట్లు ఎఇ తెలపగా అయోధ్యాపురం సెక్షన్‌లో ఇంకా సంఖ్య ఖరారు కాలేదని సంబంధిత ఎఇ తెలిపారు.




## జలపాతం వద్ద 'సండే సందడి'

గూడూరు, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త



భారీ వర్షాలు...ఆపైన సండే హాలీడే...ఇంకేముంది దర్శనీయ ప్రాంతాల్లో సందర్శకుల తాకిడికి తక్కువేమీ ఉండదు. ఇదే క్రమంలో మండలంలోని భీమునిపాదం జలపాతం వద్ద కూడా ఆదివారం 'సండే సందడి' ఆవిష్కృతమైంది. నిరంతరాయంగా కురుస్తున్న వర్షాల వల్ల జలపాతానికి వచ్చే వరద తాకిడి ఎక్కువ కావడంతో జలపాతం ఉరవడి కూడా ఉధృతంగా మారింది. పాల నురగ మాదిరిగా యాభై అడుగుల ఎత్తునుండి భారీ శబ్దంతో ఈ జలపాతం దునికి పడుతోంది. దీంతో కనువిందు చేసే ఈ దృశ్యాన్ని తనివితీరా తిలకించి ఆ ఆనందాన్ని ఆస్వాదించాలనే ఆసక్తి, ఆనందంతో సందర్శకులు భీమునిపాదం జలపాతం వద్దకు చేరుతున్నారు. జలపాతం ఉరవడి ఉధృతంగా ఉందని తెలుసుకున్న వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఆదివారం సెలవు దినం కావడంతో పిల్లాపాపలతో తరలి వచ్చారు. జలపాతం నీళ్లలో జలకాలాడి కేరింతలు కొట్టారు. పచ్చదనం పరుచుకున్న పరిసర ప్రాంతాలను తిలకించి పులకరించిపోయారు.

# భారీ వర్షాలకు నష్టపోయిన వారిని ఆదుకోవాలి

### మాస్‌లైన్ ప్రజాపంథా డిమాండ్

కేసముద్రం, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్ట పోయిన రైతులను, ఇతర కుటుంబాల వారిని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి కోరారు. కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్షాలతో జరిగిన పంట నష్టం అంచనాలను వేసేందుకు అధికారులు ఇంకా క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడం విచారకరమన్నారు. లక్షల్లో పెట్టుబడులు పెట్టి సాగు చేస్తున్న పంటలను రైతులు వర్షాలకు నష్టపోయి విలపిస్తున్న తరుణంలో అధికారులు తగిన రీతిలో స్పందించకపోవడం సరైంది కాదన్నారు. వేలాది ఎకరాల వరి, పత్తి, మక్కజొన్న, మిర్చి పంటలతో పాటు కూరగాయల తోటలు కూడా నీటి మునిగాయని, వరదలకు కొట్టుకుపోయాయన్నారు. నష్టపోయిన రైతాంగానికి ఆహార పంటలకు ఎకరాన రూ.30వేలు, వాణిజ్యపంటలకు రూ.50వేలు పరిహారం అందించాలని ఆయన



ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఇళ్లు, పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకలు నష్టపోయిన వారికి కూడా నష్టపరిహారం అందజేయాలని, ఇళ్లు పూర్తిగా కోల్పోయిన కుటుంబాలకు యుద్ధ ప్రాతిపదికన ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వాలు ఈ విషయంలో గంభీరమైన ప్రకటనలకే పరిమితమై కాలయాపన చేయవద్దన్నారు. ఈ సమావేశంలో పైండ్ల యాకయ్య, కందాల రంగయ్య, ఆవుల కట్టయ్య, బొమ్మగాని ఎల్లయ్య, పెరుమల్ల జానకిరాముడు, రాము పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పిఏసిఎస్ చైర్మన్ పరామర్శ

గూడూరు, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త

మండలంలోని బొల్లెపెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బుర్ర వీరస్వామి భార్య ఐలమ్మ మృతి చెందగా వారి కటుంబ సభ్యులను గూడూరు పిఏసిఎస్ చైర్మన్ చల్ల లింగారెడ్డి ఆదివారం పరామర్శించారు. మృతురాలి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అదేవిధంగా గ్రామ శివారులోని ఎస్సీ కాలనీకి చెందిన కోరె తిరుపతమ్మ ఇటీవల పిడుగుపాటుకు మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను కూడా పరామర్శించిన లింగారెడ్డి వారికి రూ.5వేలు ఆర్థికసాయమందించారు. ఆయన వెంట ఆ గ్రామ నాయకులు పలువురు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.




## పురుగుల మందు తాగి ఆత్మహత్య

కేసముద్రం, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త

క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మండలంలోని ఇంటికన్నె శివారు ముత్యాలమ్మతండా వాసి భూక్య శ్రీను (37) ఆసుపత్రిలో చికత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ మురళీధర్‌రాజు తెలిపారు. తాగుడుకు బానిసైన శ్రీను అదే మత్తులో ఈనెల 7న క్రిమిసంహాకర మందు సేవించగా చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారని, అక్కడ ఆయన చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## మృతులకు మాజీ ఎంపిపి నివాళులు

గూడూరు, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త



పట్టణంలోని చంద్రుగూడెం ప్రాంతానికి చెందిన ఎండి అజీజ్, ఎస్‌కె పాషాలు అనారోగ్య కారణాల నేపథ్యంలో ఆదివారం మృతి చెందగా వారి కుటుంబాలను మాజీ ఎంపిపి నూనావత్ రమేష్‌నాయక్ పరామర్శించారు. ఈమేరకు అదేరోజు వారి ఇళ్లకు వెళ్లి మృత దేహాలను సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంత్యక్రియల ఖర్చుల కొరకు వారికి కొంత ఆర్థికసాయమందించారు. ఆయన వెంట హెచ్ శివ, మండల మల్లేష్, మంజ, మహేష్, రమేష్, మోహన్, నవీన్ పాల్గొన్నారు.

## గణపతి పూజా సామాగ్రికి వెళుతూ రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

### మాజీ ఎంపితో సహా పలువురి పరామర్శ

కేసముద్రం, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త



వినాయకచవితి పర్వదినంనాడు మండలంలోని అర్పనపల్లి గ్రావంలో విషాదం చోటు చేసుకుంది. పండుగ సందర్భంగా గణపయ్యకు పూజలు చేయాలనే ఆనందంతో పూజా సామాగ్రి కొరకు భర్తతో ద్విచక్రవాహనంపై వెళుతున్న ఓ ఇల్లాలు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందింది. ఈ సంఘటన ఆ కుటుంబంతో పాటు గ్రామస్తులను విషాదానికి గురి చేసింది. వివరాలిలా ఉన్నాయి. ఆర్పనపల్లి గ్రామానికి చెందిన కెంచ మొగిలి భార్య, గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు కెంచ రాజమణి (50) వినాయకచవితి పండుగనాడు పూజా సామాగ్రి కొరకు భర్తతో కలిసి మండల కేంద్రానికి బయలు దేరింది. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం మార్గ మధ్యంలో ఉప్పరపల్లి గ్రామ సమీపంలో అదుపుతప్పి పడిపోయింది. ఈ సంఘటనలో బైక్ వెనక కూర్చున్న రాజమణి తలకు తీవ్రగాయాలు కాగా వెంటనే ఆమెను చికిత్సకై అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందింది. మృతురాలికి భర్తతో పాటు రాధాకృష్ణ, సూర్యకుమార్ అనే ఇద్దరు కుమారులున్నారు. మహిళాసంఘం అధ్యక్షురాలిగా గ్రామంలో అందరికి సుపరిచితురాలుగా ఉన్న రాజమణి మృతితో గ్రామ మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. కాగా రాజమణి అంత్యక్రియలను గ్రామస్తుల కన్నీటి వీడ్కోలు మధ్య ఆదివారం నిర్వహించారు. రాజమణి మృతదేహాన్ని మాజీ ఎంపి మాలోతు కవిత, మాజీ పిసిసి సభ్యుడు దస్రునాయక్‌లతో పాటు పలువురు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## నష్టం అంచనా నివేదికలు అధికారులు సత్వరమే అందించాలి



**జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా**

**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :** ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జిల్లాలో జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పర్యటించి సత్వరమే నివేదికలు అందించాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా అధికారులను ఆదేశించారు. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో సంభవించిన వరదనష్టంపై అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్‌లతో కలెక్టర్ శనివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సంబంధిత శాఖ అధికారులకు తగు ఆదేశాలను జారీచేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాలు, ఒక మున్సిపాలిటీలో వర్షాలకు జరిగిన నష్టాన్ని ఇంజనీరింగ్, తహసీల్దార్, ఎంపీడీవో సంబంధిత జిల్లా శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సంయుక్తంగా పర్యటించి సమన్వయంగా అంచనాలు రూపొందించి ఈనెల 8వ తేదీలోగా నివేదికలు అందించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చేయకూడదన్నారు. దెబ్బతిన్న రహదారులు, వరదల్లో కొట్టుకపోయిన గొర్రెల వివరాలు, పంటనష్టం వివరాలు తదితర వివరాలపై రూపొందించిన నివేదికలను ఈ నెల 8వ తేదీలోగా ఆర్డీవోల ద్వారా ధ్రువీకరణ పొంది అందించాలని తెలియచేశారు.

## రానున్న రెండు రోజులపాటు భారీ వర్షాలు

### ఎల్లో అలెర్ట్ జారీ చేసిన వాతావరణశాఖ

### ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి ఎస్ఐ తాజుద్దీన్

**ఏటూర్‌నాగారం, ప్రభాతవార్త:**



రానున్న రెండు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసిన నేపథ్యంలోములుగు జిల్లా ఎస్పీ శబరీష్, ఏఎస్పీ శివమ్ ఉపాధ్యాయ, సీఐ శ్రీనివాస్ సూచనల మేరకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ తాజుద్దీన్ తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు ప్రయాణాలు చేయవద్దని, మత్స్య కారులు వాగులు, రిజర్వాయర్‌లలో చేపల వేటకు వెళ్లవద్దని, వాగులు దాటే ప్రయత్నం చేయకూడదని, భారీ వర్షాల సూచనల కారణంగా పిడుగులు పడే అవకాశం ఉందని, పశువులు కాపరులు అడవులకు వెళ్లవద్దని, వర్షాల నేపథ్యంలో విద్యుద్ఘాతం ఏర్పడే అవకాశం ఉండటుందని విద్యుత్ స్తంభాలు ముట్టుకోవద్దని సూచించారు. శిథిలావస్థలో ఉన్న గృహాల్లో నివాసముంటున్న ప్రజలు వెంటనే ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

## రోడ్డు మరమత్తు పనులు చేపట్టాలి

**చిన్నగూడూరు, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

మండలకేంద్రంలోని ఆకేరువాగుపై నిర్మించబడిన బ్రిడ్జి ముందు ఉన్న రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకపోయింది. రోడ్డు కొట్టుకపోవడంతో ఆ ప్రాంతంలో 10ఫీట్ల మేర గుంతలు ఏర్పడ్డాయి. దీంతో మండల కేంద్రం నుండి చుట్టుప్రక్కల గ్రామాలకు వెళ్లాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చుట్టప్రక్కల గ్రామాల విద్యార్థులు మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రావాలంటే అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రోడ్డు కొట్టుకపోవడంతో వంతెనమీదకు వేసిన నిచ్చెన ద్వారా బిక్కుబిక్కుమంటూ పాఠశాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా రైతులు తమ పొలాల వద్దకు వెళ్లాలన్నా నిచ్చెన ద్వారానే వెళ్లాల్సి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తక్షణమే చొరవ తీసుకొని రోడ్డు మరమత్తు పనులను తక్షణమే పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.



## అడ్డగోలుగా క్వార్టర్స్ కేటాయింపు

మొదటి పేజీ తరువాయి

అంతేకాకుండా సింగరేణి సంస్థను ఆసరాగా తీసుకున్న ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు ఎల్ల తరబడి వాడుకుంటూ బిల్లులు చెల్లించకుండా అదే శాఖకు చెందిన వారికి తమకు నచ్చినట్లుగా అప్పగించి చేతులు దులుపుకుంటున్నారు. ఈ విషయంలో ప్రభుత్వ ఉద్యోగులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులకు అలాట్‌మెంట్ చేసిన క్వార్టర్స్‌కు ఎటువంటి రుసుమును సింగరేణికి చెల్లించకుండా లక్షలాది రూపాయలు బకాయి పడినా నేటి వరకు చెల్లించకపోవటంతో దిద్దుబాటు చర్యలకు భూపాలపల్లి ఏరియా యాజమాన్యం పూనుకుంది. అదే విధంగా క్వార్టర్స్ పొందిన కార్మికులు తమ పలుకుబడితో అదనంగా పలు కారణాలు చూపుతూ క్వార్టర్స్ పొంది ఇతరులకు కిరాయిలకు ఇవ్వటం ఇక్కడ చర్చనీయాంశంగా మారింది. చిన్నపాటి తప్పులకు శాఖ పరమైన చర్యలు తీసుకునే సింగరేణి యాజమాన్యం ఏకంగా సంస్థను తప్పుదోవ పట్టించి అదనపు క్వార్టర్స్‌ను పొంది కిరాయిలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నట్లు ఇటీవల విచారణలో బట్టబయలైంది. సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులకు క్వార్టర్ అలాట్‌మెంట్ కావాలంటే సవాలక్ష నిబంధనలను విధించే యాజమాన్యం ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల ఒత్తిడితో ఇష్టారాజ్యంగా క్వార్టర్స్‌ను అలాట్‌మెంట్ చేయగా తిష్ట వేసి నేటి వరకు ఉంటున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు అలాట్‌మెంట్ చేసిన క్వార్టర్స్‌ను బదిలీపై వెళ్లగా తమ శాఖకు సంబంధించిన వారికి అప్పగించి సింగరేణికి మాత్రం రెంట్ కట్టకుండా జాప్యం చేస్తున్నట్లు విచారణలో తేలింది. సొమ్ము ఒకరిది.. సోకు ఒకరిది అన్న చందంగా సింగరేణి క్వార్టర్స్ వ్యవహారం గత కొంత కాలంగా యథేచ్ఛగా కొనసాగిందనే విషయం ఇటీవల చేపట్టిన తనిఖీలో వెల్లడైంది. భూపాలపల్లి ఏరియాలో పనిచేస్తున్న సింగరేణి కార్మికులు 5400 మంది ఉండగా అందులో సింగరేణి సంస్థ నిర్మించిన క్వార్టర్స్ కాకుండా మరో 1400 మందికి హెచ్‌ఆర్‌ఏ చెల్లించాల్సి ఉండగా అక్రమ క్వార్టర్స్ పొందిన క్రమంలో మరో 400 మంది కార్మికులకు హెచ్‌ఆర్‌ఏ తీసుకున్నట్లు ఆడిట్‌లో బయటపడగా చర్యలకు తావిచ్చింది. ఈ విషయంలో ఇటీవల బదిలీపై వచ్చిన సింగరేణి జీఎం సయ్యద్ హబీబ్‌హుస్సేన్ క్వార్టర్స్ విషయంలో సమగ్ర విచారణ చేపట్టగా ఆసక్తికర విషయాలు బయట పడ్డాయి.

### అసలు సమస్య ఇక్కడ మొదలైంది...

భూపాలపల్లి ఏరియాలోని పలు గనులు, డిపార్ట్‌మెంట్‌లలో పనిచేస్తున్న కార్మికుల కోసం సింగరేణి సంస్థ 4751 క్వార్టర్స్‌ను వివిధ ఏరియాల్లో నిర్మించటం జరిగింది. క్వార్టర్స్ లేని వారు కేవలం 1400 మంది మాత్రమే ఉండగా వారికి మాత్రమే హెచ్‌ఆర్‌ఏ చెల్లించాల్సి ఉంది. కాని నిబంధనల ప్రకారం అంతకు మించి హెచ్‌ఆర్‌ఏ చెల్లింపు జరగటంతో అసలు సమస్య బయటపడింది. క్వార్టర్స్ ఉన్నా కూడా హెచ్‌ఆర్‌ఏ చెల్లించటం పట్ల సింగరేణి యాజమాన్యం విస్మయంకు గురై ఇటీవల వచ్చిన జీఎం సయ్యద్ హబీబ్‌హుస్సేన్ దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. కార్మికులకు సంబంధించిన క్వార్టర్స్‌లో సింగరేణి కార్మికులు కాకుండా ఇతరులు ఉండటం గుర్తించిన అధికారులు చర్యలకు పూనుకున్నారు. సింగరేణేతరులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు సింగరేణి క్వార్టర్స్‌లో ఉండటం వలన విద్యుత్, నీరు తదితర సదుపాయాలను పొందుతున్నట్లు గుర్తించారు. గత కొంత కాలంగా సింగరేణి క్వార్టర్స్ ఉంటూ కనీసం అద్దె చెల్లించకుండా దర్జాగా జల్సాలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న రెంట్‌దారుల విషయంలో సమగ్ర విచారణ చేపట్టారు. దీంతో అసలు కథ బయటపడింది.




### ప్రత్యేక బృందాల ఏర్పాటు...

భూపాలపల్లి ఏరియాలోని క్వార్టర్స్ విషయంలో పలు ఆరోపణలు వస్తున్న క్రమంలో జీఎం సయ్యద్ హబీబ్‌హుస్సేన్ ప్రక్షాళన చేపట్టాలనే దృఢ సంకల్పంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆరుగురు సింగరేణి సెక్యూరిటీ ఉద్యోగులకు మూడు టీంలుగా ఏర్పాటు చేసి గత కొద్ది రోజుల నుండి డోర్‌టూ డోర్ తనిఖీ చేపట్టారు. తనిఖీలో భాగంగా సింగరేణికి చెందిన క్వార్టర్స్‌లో కార్మికులు కాకుండా కార్మికేతరులు రెంట్‌కు ఉంటున్నట్లు, ప్రభుత్వ అధికారుల ఆదేశాల మేరకు కేటాయించిన క్వార్టర్స్‌లో వారు ఉండకుండా ఇతరులు ఉంటున్నట్లు గుర్తించారు. ప్రభుత్వ అధికారులు జిల్లా ఏర్పాటు అనంతరం సింగరేణి నుండి పాలన సౌకర్యంలో భాగంగా కలెక్టర్ ఆదేశాలు, సూచనల మేరకు క్వార్టర్స్‌ను పొందారు. కాగా అప్పటి నుండి ఇప్పటి వరకు కొంత మంది అధికారులు, ఉద్యోగులు బదిలీ కాగా వారి స్థానంలో ఇతర ప్రదేశాల నుండి వచ్చిన వారికి అదే క్వార్టర్‌ను ఇవ్వటం మూలంగా రెంట్ చెల్లించకపోగా విద్యుత్, త్రాగునీరు, పారిశుద్ధ్య పనులు ఉచితంగా అందజేస్తున్నారు.

### ప్రవేట్ వ్యక్తులకు రెంట్..

భూపాలపల్లి ఏరియాలో సింగరేణి కార్మికులు 5400 మంది ఉండగా సింగరేణి యాజమాన్యం 4751 క్వార్టర్స్‌ను నిర్మించటం జరిగింది. ఇందులో కొంత మంది కార్మికులు తమకు నివాసం ఉండటంతో పాటు ఇతర ప్రాంతాల నుండి ఉద్యోగం చేస్తుండటంతో తమ క్వార్టర్స్‌ను ఇతరులకు కిరాయికి ఇవ్వటం జరిగింది. భూపాలపల్లి ఏరియాలో సుమారు 150 మంది ఉన్నట్లు ఇప్పటి వరకు గుర్తించగా ఇంకా మరో 100 క్వార్టర్స్ కిరాయికి ఇచ్చినట్లు తెలుస్తోంది. సింగరేణి కార్మికులకు యాజమాన్యం భూపాలపల్లి ఏరియాలోని పలు కాలనీలలో క్వార్టర్స్ నిర్మాణం చేయగా సీనియారిటీ ప్రాతిపాదికన అలాట్‌మెంట్ చేసింది. కాని అలాట్‌మెంట్ చేయబడిన కార్మికులు వారు ఉండకుండా ఇతర ప్రదేశాల్లో నివాసం ఉంటూ వారి క్వార్టర్స్‌ను ఇతరులకు అద్దె తీసుకుంటూ కిరాయికి ఇస్తున్నారు. ఏడాదికి 40 నుండి 50 వేల వరకు అద్దె తీసుకుంటున్నట్లు సమాచారం. దీంతో సింగరేణికి చెందిన ఉచితంగా వచ్చే విద్యుత్, త్రాగునీరు ఇతరులకు చేరుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ విషయం గత కొన్నేళ్లుగా కొనసాగుతున్నా ఇటీవల వచ్చిన జీఎం క్వార్టర్స్ విషయంలో దృష్టి సారించి విచారణ చేపట్టడతో ఆసక్తికర విషయాలు బయటపడుతున్నాయి.

### నిబంధనలకు విరుద్ధంగా డబుల్ క్వార్టర్స్...

భూపాలపల్లి ఏరియాలో కొంత మంది కార్మికులు క్వార్టర్స్ సీనియారిటీ ప్రాతిపాదికన తీసుకోగా తమ పలుకుబడిని ఉపయోగించి అదనంగా క్వార్టర్స్ పొందినట్లు ఇటీవల జరిపిన సర్వేలో వెల్లడైంది. ఏరియాలో 84 మంది పైబడి కార్మికులు అదనపు క్వార్టర్స్‌ను తీసుకున్నట్లు ఇంటింటి సర్వేలో బయటపడింది. క్వార్టర్స్ రాని కార్మికులు ఎప్పుడు క్వార్టర్ వస్తుందని ఎదురుచూస్తున్న అద్దె ఇండ్లలో నివాసం ఉంటున్న క్రమంలో కొంత మంది మాత్రం అదనంగా క్వార్టర్స్‌ను తీసుకొని ఇతరులకు అద్దెకు ఇవ్వటం చర్చనీయాంశంగా మారింది. క్వార్టర్స్ అలాట్‌మెంట్ విషయంలో సీనియారిటీ ప్రాతిపదికన ఇవ్వగా కొంత మంది రాజకీయ, అధికార యంత్రాంగం పేరుతో క్వార్టర్స్‌ను అలాట్‌మెంట్ చేసుకున్నట్లు గుర్తించారు. ఇందుకు గతంలో పనిచేసిన సింగరేణి అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్వాహం అనే తేటతెల్లమైంది.

### దిద్దుబాటు చర్యలకు దిగిన సింగరేణి...

అదనపు క్వార్టర్స్ పొందిన కార్మికులతో పాటు అద్దెకు ఇచ్చిన క్వార్టర్స్ విషయంలో ఏరియా జనరల్ మేనేజర్ ఆదేశాల మేరకు నోటీసులు ఇవ్వగా స్పందించని వారిపై చర్యలు తీసుకున్నారు. సింగరేణి ఆదేశాలను ఖాతరు చేయని క్వార్టర్ పొందిన సింగరేణి కార్మికుల విషయంలో తగు చర్యలకు రంగం సిద్ధం చేశారు. ఇందులో భాగంగా క్వార్టర్‌లో అలాట్‌మెంట్ చేసిన కార్మికులు కాకుండా ఇతరులు ఉంటే వారికి విద్యుత్, త్రాగునీరు సరఫరా నిలిపివేయటంతో పాటు సంబంధిత కార్మికులకు సాలరీ రికవరీ చేస్తున్నారు. అంతే కాకుండా డబుల్ క్వార్టర్స్ పొందిన వారికి సైతం ఇదే విధానంను అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల సుమారు 5 లక్షలను కార్మికుల నుండి రికవరీ చేసినట్లు అధికారులు తెలుపుతున్నారు.

### కిరాయి చెల్లించాలని కలెక్టర్‌కు పిర్యాదు..

భూపాలపల్లి ఏరియాలో నూతనంగా జిల్లాగా ఏర్పడిన క్రమంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 143 మంది అధికారులు, ఉద్యోగులకు పలు ప్రదేశాల్లో క్వార్టర్స్‌ను నామినల్ రెంట్ పద్ధతిలో సింగరేణి యాజమాన్యం కేటాయించింది. ఇందులో భాగంగా విద్యుత్, త్రాగునీటిని సైతం ఉచితంగా సరఫరా చేస్తుంది. గత కొన్నేళ్ల నుండి అలాట్‌మెంట్ చేసిన క్వార్టర్స్‌కు అద్దె చెల్లించకుండా వినియోగించుకుంటున్న వారి విషయంను తీవ్రంగా పరిగణించి చర్యలకు దిగారు. ఈ మేరకు భూపాలపల్లి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ జిల్లా కలెక్టర్‌కు బకాయి పడిన అధికారుల వివరాలను తెలియపరచడం జరిగింది. ఇప్పటి వరకు రూ. 2.70 కోట్లు రెంట్ విషయంలో బకాయి పడగా గత నెలలో అద్దెకు ఉంటున్న వారికి నోటీసులు జారీ చేయగా 70 లక్షలు రికవరి అయినట్లు సమాచారం.

### నిబంధనలను అమలు చేస్తున్నాం....సయ్యద్ హబీబ్‌హుస్సేన్, ఏరియా జనరల్ మేనేజర్



సింగరేణి నిబంధనల ప్రకారం క్వార్టర్స్ అలాట్‌మెంట్ విషయంలో అమలు చేస్తాం. సింగరేణి కార్మికులు క్వార్టర్స్‌ను ఇతరులకు అద్దెకు ఇవ్వటం సరికాదు. సింగరేణికి సంబంధించిన విద్యుత్, త్రాగునీరు, పరిశుభ్రత విషయంలో కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తుంది. ప్రభుత్వశాఖలకు కేటాయించిన క్వార్టర్స్ విషయంలో తప్పనిసరిగా రెంట్ చెల్లించాల్సి ఉంది. ఈ విషయంలో కలెక్టర్‌కు పిర్యాదు చేశాం. ఆయా శాఖలకు కేటాయించిన క్వార్టర్స్‌కు నిబంధనల ప్రకారం అద్దె చెల్లించాల్సి ఉంది. డబుల్ క్వార్టర్స్ పొందిన వారి విషయంలో సమగ్ర విచారణ అనంతరం శాఖ పరంగా చర్యలు తీసుకుంటాం.